శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్త్రిక.

కాకినాడ.

రెండునెలల కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౨౬.	ఈశ్వరనామసంవత్సరము. జ్యేష్ఠాషాఢమాసములు.	సంచిక ౨.

బాలకవిశరణ్యము.

'ఆదివ్యంజనలోపము' అను శీర్షిక (264 పేజి) లో మెఱుఁగెట్టి, ఉసుఁగోసుకొను మున్నగు ప్రయోగములతోపాటు అడుగు + వెంట 'అడుగెంట' అని పాండురంగమాహాత్మ్యములోని పద్యమొకటి యాప్రయోగముల నడుమ నీయఁబడినది. ఈ'అడుగెంట' అనునది పరిపూర్ణార్థకమై ఔపవిభక్తికాంత మగు 'అడుగేఁడు' అనుదాని సప్తమ్యంతరూపము కాని 'అడుగువెంట' అనుదానిలో వకారము లోపింపఁగా మిగిలిన 'ఎంట' రూపము కాదు, అని యాపద్యము చెప్పుచునే యున్నది. 'తత్పురీహారులు (రౌతులు) కానంత మకలించిరేని యొక్క యడుగు పరిమితి గలస్థలమునందే (పరుగెత్తుచున్నను) సంభ్రమింపక నిలుచును. ఒకింత త్రోలినచో మెఱుచాఁచి సప్తసముద్రములు దాఁటఁగలవు... అని గుఱ్ఱములగతిలాఘవము పై పద్యమున వర్ణింపఁబడినది. అచట 'నడుగువెంటనె నిలుచును' అని యర్థము చెప్పినయెడల 'నెవరియడుగువెంట' అను నాకాంక్షకు సమాధానము లేదు కావున వెంట, ఎంట, అయిన దనుట యుక్తము కాదు. అది వెంటశబ్దమే యగునెడల 'జుట్టెంటిలో' అనుమను చరిత్రప్రయోగము కుదురు నెట్లు. 'వెంట'కు 'వెంటిలో' అను రూపము లేదు గదా. మఱియు, 'జుట్టిలి'లోని లివర్ణకమునకుఁ బరిమా

ణార్థక మగు ఎండు ప్రత్యయము పరమగునపుడులోపము గాని మఱియే యజాదిశబ్దము పరమైనను లోపించుట కాధారము కానరాదు. 'బారెఁటిలో మూరెఁటిలో' మున్నగుశబ్దములందు వెంటలోని నిందుసున్న మాఱుటెట్లో తెలియదు. పరిమాణార్థక మగు ఎండుప్రత్యయమున కిట్టిరూపముతో బహుళముగా గ్రంథములందు వాడుక యున్నది.

ద్వి. జుట్టెంట నొక్కొక్క చోద్యంబు గలదు,... జేనెంట నొక్కొక్క శివ
మూర్తి గలదు, బారెంటనొక్కొక్క పర్వతం బలరు.
పండితా, పర్వ, 3౮ ౪ పా.

సీ. జేనెంట జేనెంట శివలింగములు కోటిసంఖ్య నేపురమునఁ
జాలనొప్పు కాశీ. 3.

సీ. ఇది గాలికనిన మూఁకవరాహదనుజేంద్రు నైనజుట్టెంటికో నాఁగఁజాలు
మను, ౪.

కావున 'అడుగెంట' లోని 'ఎంట' ఎండుప్రత్యయాంతముపై వచ్చు నొపవిభక్తికసప్తమీవిభక్తిరూపము కాని వెంటలోని దో మఱి యేయితరపదములోనిదో యాదివ్యంజనము లోపించిన రూపము కాదు.

ఈ 'ఆదివ్యంజనలోపము' అనుశీర్షికకు వెనుకనున్న 'ప్రథమవ్యంజనలోపము' అనుశీర్షికతో మోపు+పెట్టె=మోపెట్టె, బొబ్బ+పెట్టె=బొబ్బెట్టె మొదలగునుదాహరణములతోపాటు 'తలపెట్టు' అను నొకపదము కూడ నీయఁబడినది. ఈ 'తలపెట్టు' ఎట్టిదో రవంత యాలోచింతము. తలఁపు+పెట్టు లోని పకారము ప్రథమవ్యంజనము లోపింప ఎట్టు అయి తలఁపు ఎట్టు=తలపెట్టు అగు నని యీగ్రంథాభిప్రాయము కావచ్చును. అట్లు సంధి యగునప్పు డందలి ఖండబిందువునకు లోప మెట్లు? ఖండబిందువు లేదేమో యనుటకు మ... మున్న కైపెక్కినట్టితలం పద్మ్యత నీకుఁగల్గినది - భార, ఉద్యో, 3. ౭౨ మున్నగు ప్రాచీనకవిప్రయోగముల మొదలుకొని యీగ్రంథమునందలి ముఖబంధనమునందలి 'జనులతలఁపుదెలుపు సాధనములు' ౨. వఱకు ననంతముగాఁ

ప్రయుక్తమైనది యీ “ఎట్టు” పరమగునంతమాత్రమున లోపించు నను టయు వలనుపడదు. కావున ‘తలపెట్టు’ నకీగ్రంథమునఁ గలయనుశాస నికము ప్రామాదికము.

ప్రమాదము మనుజులకు సహజము, కావుననే ప్రమాదములు ప్రమాణములుకావని విజ్ఞులయభిప్రాయము. ప్రాచీనులు మొదలుకొని నేఁటివఱకుఁగలలాక్షణికుల నందఱను గంఠోక్తిగాఁ దప్పు లని వ్రాసిన యీగ్రంథమున నిట్టిప్రమాదము లుండఁగా ప్రమాదము లేనికవి యెవ్వఁడైన నుండునా ? అట్టియాకవులప్రమాదము లన్నిటిని ప్రమాణము లని చూపి పూర్వలాక్షణికగ్రంథములఁ ద్రోసిపుచ్చుట యెట్టిదో చదువరు లూహింతురుగాక !

యథాలాభముగ నీగ్రంథమును విప్పిచూడఁగా మాకారెండు తావులం దిట్టిపొరపాటులు కనఁబడినవి. సమగ్రముగాఁ జదివినచో వీని కెచట నయిన సమాధానము లందు ముందు వెనుకల నున్న వేమో చూచి యట్లున్నచో తెలిపెదము. ఇం కొక చిన్నసందేహము. ‘ప్రథమ వ్యంజనలోపము’ అని యొకశీర్షికయును, వెనువెంటనే ‘ఆదివ్యంజన లోపము’ అని మఱియొకశీర్షికయు, నిందుఁగలవు. ఆరెంటికి భేదమేమి యో తెలియకున్నది. విషయసూచికయందు ‘ప్రథమవ్యంజనలోపము’ ఒకటియే కలదు. రెండవది దానిలో నంతర్భాగమేమో యనుకొనుటకు భేదమేమియుఁ గానరాదు. అందలిభేదము నెవ్వరయినఁ దెలిసినవారు తెలుపఁగోరుచున్నాము.

శ్రీకృష్ణదేవరాయల సంస్థానమునందలి వీరశైవకవులు.

తొంగర్చేటి సోమసుందరశాస్త్రిగారు-ఆదవాని.

విజయనగర సామ్రాజ్య కాలమునందు కర్ణాటకవాఙ్మయమునకు నపారమైన యుపకారము లభించినది. ప్రాచీనకాలవాఙ్మయమందు కర్ణాటకవాఙ్మయ మితరభాషావాఙ్మయముల కెంతమాత్రము తీసిపోకయుండె నని చెప్పుటకు సంతోషావహమగుట సహజము. కర్ణాటకదేశపరిపాలకు లగు మహారాజులు కన్నడభాషాభ్యుదయమునకై మిక్కిలి సాహాయ్యము గావించిరి. శ్రీకృష్ణదేవరాయలవారి యాస్థానమునందలి తెలుఁగుకవులఁగూర్చి తెలియనియాంధ్రుఁ డుండఁడు. రాయలవారి వీరశైవకవుల పరిచయ మాంధ్రసోదరులకుఁ గల్గించుట యీవ్యాసలేఖనోద్దేశము.

విజయనగరసామ్రాజ్య పరిపాలకులపైకి శ్రీబుక్కరాయలకాలము నందే కవులకు, పండితులకు నాస్థానప్రవేశము గల్గుచు వచ్చెను. ఈకాలమునందే భీమకవి బసవపురాణమును వ్రాసెను. ఇమ్మడి హరిహరరాయలకాలమునందు పద్మనాంకకవి పద్మరాజపురాణము వ్రాసెను. నీలకంఠశివాచార్యులవారు బ్రహ్మసూత్రములకు వ్యాఖ్యానరూపమయిన క్రియాసారమును వీరశైవధార్మికసంస్కృతోద్గ్రంథమును రచియించుటగాక, కన్నడమునందుఁగూడ ననేకగ్రంథములు రచించినట్లు తెలియుచున్నది. తర్వాత ప్రౌఢదేవరాయలవారికాలము వీరశైవవాఙ్మయాభివృద్ధికి మహాపర్వకాలముగ నుండె నని ధారాళముగఁ జెప్పవచ్చును. ప్రౌఢదేవరాయలు స్వయము వీరశైవదీక్షను గ్రహించుటయేగాక, యీమతప్రచారమునకు కర్ణాటకభాషాసాహిత్యకళాభ్యుదయమునకు నత్యంతసాహాయకుఁడై యుండెను.

ప్రౌఢదేవరాయలవారి ముఖ్యమంత్రియును సేనాధిపతియు నగు లక్కణ్ణకవి శివతత్త్వచింతామణి యనుగ్రంథమును రచియించెను. కర్ణా

టకులయొక్క, అసునను, వీరశైవులయొక్క మాహాత్మ్యములన్న నింతవఱ కా గ్రంథము ముద్రితము గాకుండుట మిక్కిలి లజ్జాకర మని చెప్పఁదగియున్నది. ప్రౌఢదేవరాయల సేనాధిపతి యగుజక్కణాచార్యులవారు, "ఏకోత్తరశతస్థల" మనుగ్రంథమును వ్రాసెను.

ఈకాలమునందే చామరస వీరణ్ణొడెయను, కుమారబంకనాథ, కల్మఠదప్రభుదేవ, మున్నగు ౧౦౧ మంది జనులు విరక్తులై రాజాశ్రయమువల్ల ననేకగ్రంథములను, వచనములను వ్రాసిరి. అవన్నియు నిచట వివరించుటకు సాధ్యముగా కున్నను కొన్నిరచనలంగూర్చి మాత్ర మిచట చేర్పవలసినదిగ నున్నది. గూళూరు సిద్ధవీరన్న, శూన్యసంపాదన యను శ్రేష్ఠగ్రంథమును రచించెను. ఇతని శైలి యమోఘమైనది.

ఈరీతి, కర్ణాటకభాషలో నేపుకవిగాని వ్రాయలేదనుట యీ గ్రంథమును జదివినవారికిఁ దెలియును. చామరసకవిచే వ్రాయఁబడిన "ప్రభులింగలీల" యనునది కర్ణాటక కావ్యములలో సుప్రసిద్ధమైనది. ఈ గ్రంథము ఆంధ్ర, తమిళ, సంస్కృత, మరాటీ (ఈనాల్గు) భాషలయందుఁ బరివర్తనముఁ జెందియున్నది. ఇట్టి సుయోగము మఱి యేయితర కన్నడగ్రంథములకుఁ గలుగ లేదు. కుమారబంకనాథకవి, షట్స్థలోపదేశమును, ప్రభుదేవర టీక వచనమును వ్రాసెను. కలస్థలద నాగదేవకవి త్రిపది యనుగ్రంథమును వ్రాసెను.

మగ్గెయమాయిదేవకవి గూడ, ప్రౌఢదేవరాయలసహాయముననే (అనుభవసూత్ర (సంస్కృత) ప్రభుగీత, ఏకోత్తరస్థలదషట్పది, షట్స్థలగద్య, శతకత్రయ, అనుకొన్నిగ్రంథములను వ్రాసెను.

రెండవప్రౌఢదేవరాయలవారి కాలమునందు గురుబసవకవి, శివయోగాంగభూషణ, సద్గురురహస్య, కళ్యాణేశ్వర, స్వరూపామృత, వృషభగీత, మనోవిజయకావ్య, అను గ్రంథముల రచియించెను.

బొమ్మరస నునాతఁడు సుందరపురాణమును వ్రాసెను. కల్లరస నువాఁడు జనవశ్య అనుగ్రంథము వ్రాసెను. మఱికొందఱిని కన్నడకవులను కన్నడగ్రంథములను దెల్పుసూచిక :—

కవులు.	గ్రంథములు.
చెన్నబసవాంకన-	అక్క మహాదేవీపురాణము.
కల్మఠప్రభుదేవన-	లింగలీలావిలాసచారిత్రము.
విరూపాక్షపండితుఁడు-	చెన్నబసవపురాణము.
తోటదసిద్ధేశ్వర-	షట్స్థలజ్ఞానామృతసారము
గుబ్బియమల్లనార్యుఁడు-	వీరశైవామృతము.
	గణభాష్యరత్నమాల.
చతుర్ముఖబొమ్మరసను-	రేవణసిద్ధేశ్వరపురాణము
సింగరాజు-	మలబసవచరిత్రము.
లింగకవి-	చోళరాజచారిత్ర.
మహాలింగదేవకవి-	షట్స్థలవివేకము.
హరభక్త-	వేదభాష్యము.

వేదభాష్యమును కన్నడమునకుఁ బరివర్తనము గావించిన మొదటికవి ఈహరభక్తకవి యని తెలియఁదగును.

గురుసంజుడు-	యజుర్వేదభాష్య (కన్న)
నీలకంఠార్యుఁడు-	పరవాదిగజాంకుశతారావళి.
చెరమాంకను-	చీరమహాకావ్యము.
వీరభద్రరాజు-	వీరభద్రవిజయకావ్యము.
కిక్కిరీయారాధ్యులు-	భైరవేశ్వరకావ్యము.
చెన్నవీరన-	సారస్వతవ్యాకరణశబ్దమణి.
లింగమంత్రి-	కబ్బిగరకైపిడియకోశము.
చంద్రరవి-	శంకరశతము.
ఎమ్మబసవన-	కాలజ్ఞానము.

మొత్తమునకు విజయనగరమహారాజులకాలమునందు వీరశైవకవులసాహిత్యకళ యత్యున్నతదశను బొందియుండినది. ఆకాలమున వీరశైవకవులు తెలుఁగునఁ గూడ గొన్నిగ్రంథములను వ్రాసిరి. ఇంకను నెందఱో కవు లెన్నియో గ్రంథములను రచించినట్లు తెలియుచున్నది. విమర్శించుటకు సాధ్యము గాకున్నది. వీరశైవులందఱు తమ కన్నడసాహి

త్యము నభివృద్ధినొందించిన విజయనగరరాజులయెడ నెంతయుఁ గృతజ్ఞులై యుండుట పరమధర్మము.

ఈవ్యాసము వ్రాయుటకు సంయుక్తకర్ణాటకపత్రిక నాకెంతయుఁ దోడ్పడినది. అపత్రికాధిపతులకు వినతి.

ఆంధ్రసాహిత్యపరిషత్కృత్యము.

—శతావధాని, పీసుపాటి చిదంబరశాస్త్రిగారు.—

సీ. కావ్యంబులును నాటకములు నలంకార
ములును గూడను దెల్గుపలుపు టొకటి
వ్యాసప్రణీతంబు లగుపురాణము లెల్ల
నంచితంబుగఁ దెలింగించు టొకటి
యాయుశాస్త్రంబులయందుఁ జెప్పంబడ్డ
విషయంబు తెల్గుగావించు టొకటి
తెలుఁగులోనికి రానికళ లన్నియునుగూడ
సేకరించి తెలుంగుసేయు టొకటి
యుభయభాషలలోఁ బ్రజ్ఞ యున్నయట్టి
పండితుల నెన్నఁడును బాయకుండు టొకటి
యరయ మియ్యవి నియతకృత్యములు నీకు
నాంధ్రసాహిత్యపరిషదబ్జాయతాక్షి !

సీ. ఆంధ్రంబునం దుండినట్టి భారతమునఁ
బడినప్రమాదముల్ వాపు టొకటి
తెలుఁగుబాసకు లోటు దీర్పఁగాఁగలయట్టి
వ్యాకరణంబును వ్రాయు టొకటి
ముద్రితంబులు గాక మూల నుండినగొప్ప
తెల్గుఁబొత్తములు ముద్రించు టొకటి
తప్పుగా వ్రాయుగ్రంథములలోఁ గలతప్పు
నిశ్శంకముగను ఖండించు టొకటి

దేశభాషలయందు నాధిక్య మెనయు
తెలుఁగునఁ గలట్టిమహిమంబు తెలుపు టొకటి
యరయు మియ్యవి నియతకృత్యములు నీకు
నాంధ్రసాహిత్యపరిషదబ్జాయతాక్షి !

సీ. ఇది యయుక్తము యుక్త మిది యంచు నిర్ణయం
బొనరింపఁగలభార మూను టొకటి
పలుగాకితనమున భాషాప్రచారంబు
చేయువారలను శాసించు టొకటి
బహుకాలముననుండి పండితాగ్రణులు ద్రొ
క్కినమార్గములయంద చనుట యొకటి
గ్రామ్యంబనెడుచీడ గలుగకుండఁగ గ్రాంథి
కంబనుసస్యంబుఁ గాచు టొకటి
నియమములు లేని దనిమొకునింద తెలుఁగు
బాసకు ఘటిల్లకుండఁ గాపాడు టొకటి
యరయు మియ్యవి నియతకృత్యములు నీకు
నాంధ్రసాహిత్యపరిషదబ్జాయతాక్షి !

సీ. సంస్కృతంబునఁగలశక్తి యంతయు నాంధ్ర
మునకుఁ జేకూర్పఁగాఁ బూనుమమ్మ
తెలుఁగుబాసకు వన్నె గలిగింపఁ గలిగిన
యట్టిమార్గము లెల్ల నరయుమమ్మ
ఘనుఁ డైనయాంధ్రభోజునినాయకత్వంబు
గలకాలమును నీవు గాంచుమమ్మ
పరిషత్తులం దగ్రపదము నాసాదించి
బ్రహ్మాయువును నీవు పడయుమమ్మ
ఆంధ్రతత్త్వంబు దెలియనియాంధ్రుఁ డాంధ్ర
దేశమున లేఁ డనుచుఁ బరదేశజనులు
గూడ నుతియించుకీర్తి చేకొనఁగదమ్మ
యాంధ్రసాహిత్యపరిషదబ్జాయతాక్షి !

— ౧౨ వ పరిచ్ఛేదము. [శృంగారవ్యక్తి]. —

రసవిచారకమును మనకృతికి 'రసార్ణవ' మను పేరును సార్థకము చేయునదియు నగు నీపరిచ్ఛేదము బహువిపులముగా నుండియుండును. కాని మనకు 2 పుటలగ్రంథము మాత్రమే లభించినది. ఈప్రకరణమునకు 'శృంగారవ్యక్తి' యనుపేరీక్రిందిశ్లోకమునుబట్టి కలిగినది:

శ్లో. 'ఏ(వం) (రత్యా)దయో భావాః శృఙ్గారవ్యక్తిహేతవః
కాన్త్యాద్యవదేశైః సపఞ్చాశ ద్యథా భేదం ప్రకాశితాః.'—రసార్ణవ. ౧౨. 17.

ఈశ్లోకము భోజుని 'శృంగారప్రకాశము' న 14 వ ప్రకాశమునందలి యుపసంహారశ్లోకములలో మొదటిది. ఈప్రకాశమునందలి కడపటి యీరెండుశ్లోకములను గూడ ప్రకాశవర్షుఁడు గ్రహించెను.

శ్లో. 'జన్మానుబన్ధాతిశయసమ్పర్కానుగమా నితి
యుఞ్జీత సర్వభావేషు వర్గయో రుభయో రపి.

శ్లో. య దపి చ గదితం ప్రకర్షగామీ
భవతి రసో రతివిస్మయాది రేవ
త దిద మితి నిరాకృతం ప్రకృష్టాః
ప్రకృతిజభేద మమీహి సర్వ ఏవ.'—రసార్ణవ. ౧౨. 18-19.

శృంగారప్రకాశము [13 ప్రకాశము] న విస్తరింపఁబడిన భావముల వివిధావస్థలు—భావోదయము, వికాసము మొదలగునవి—18 వ శ్లోకమున సూచింపఁబడెను. తరువాతిశ్లోకమున నూతన మగు భోజుని రససిద్ధాంతము కొంతవఱకు సంగ్రహముగాఁ జెప్పఁబడెను. ఈసిద్ధాంత మేమన—అభిమానము, శృంగారము ననునామాంతరములు గల 'అహంకారము' నకే రసనామ ముచితము. రత్యాదులగు 49 భావములు ప్రకర్షావస్థ నందినను భావనావస్థయం దుండుటచే నవి రస మనఁ జెల్లవు. రత్యాదిప్రకర్షయే రస మనునది ప్రాచీనసిద్ధాంతము. ప్రకర్షమైనను భావమే యని భోజునిమతము. ప్రకర్షావస్థయందున్న యీభావము లన్నియు మనలో ననవరతమును బ్రకాశించునహంకారదీపికను బ్రజ్వలింపఁజేయును ['సప్తార్చిషం ద్యుతిచయా ఇవ వర్ధయన్తి']. ఈయహంకారమే మన మనుభవించునది, విషయాంతరముల

ననుభవించుటకు సాధనభూత మైనది. కావున 'అహంకారశృంగారాభిమాన' మొక్కటియే రసము. 'సరస్వతీకంఠాభరణము'నఁ గూడ రసప్రకరణము మొదట [5 పరి.] నీతని సిద్ధాంత మిట్లు సూత్రప్రాయముగా నొసఁగఁబడెను:

'రసోఽభిమానోఽహఙ్కారః శృఙ్గార ఇతి గీయతే.'

ఈనవీనమతము నావిష్కరించిన పిమ్మట భోజుఁడు ప్రాచీనాలంకారికులు చెప్పిన 'శృంగారము' [స్త్రీపురుషప్రేమ] రతియను భావము యొక్క ప్రకర్షావస్థయే యని నుడివియున్నాఁడు. ఈరతి 'అహంకారశృంగార' కల్పకముయొక్క ప్రథమముఁ బ్రధానము నగునంకురము. 'శృంగారప్రకాశము'[11 ప్రకాశ.] న నీరతినే 'సకలభావమూర్ధాభిషిక్త' మని యీతఁడు చెప్పియున్నాఁడు. రతిప్రపంచక మగు 13 వ ప్రకాశము తుదిని—

౧. శ్లో. 'సైష భావో రతి ర్నామ.'
౨. శ్లో. 'భావాన్తరేభ్యః సర్వేభ్యః.'
3. శ్లో. 'నిసర్గసంసర్గసుఖైః ప్రభేదైః.'

అనునీశ్లోకములలో రతివిచారము నుపసంహరించెను. ఈశ్లోకములు మూఁడును రసార్ణవమున స్వీకరింపఁబడినవి. [౫ పరి. 12-14]

'రసార్ణవము'న నీప్రకరణమున 'శృంగారప్రకాశము' సారము-అందుఁ బ్రధానముగా 11, 12, 13 ప్రకాశముల సారము-సంగ్రహింపఁబడి యుండును. రసార్ణవమునఁ బంచమప్రకరణము-

'ఉక్తః సోఽయం విభావానుభావసఞ్చారిసఙ్కరః
క్రమేణ సర్వభావానాం శృఙ్గారేషు చతుర్ష్వపి.'

అని ప్రారంభింకఁబడెను. దీనినిబట్టి మొదటఁ జాలభాగ ముత్సన్నమైనట్లు తెలియుచున్నది. ఇటఁ జెప్పఁబడిన చతుర్విధశృంగారములును భోజుఁడు చెప్పిన ధర్మార్థకామమోక్షశృంగారములే. శ్లోకాదిని 'ఉక్తః' అని చెప్పఁబడుటచే లుప్త మగుభాగమున 'శృంగారప్రకాశము' నందలి 11, 13, 14, 18-21 ప్రకాశములలో వివరింపఁబడిన

49 భావములయొక్క విభావములు మొదలగునంశములు సమాలోచింపఁబడియుండును.

రాఘవన్ పండితులు చెప్పినట్లు భోజునికిఁ బిమ్మట వచ్చినయాలంకారికులలో విలక్షణ మగుభోజుని రససిద్ధాంతమును సరిగా బోధపఱచుకొనినవారు బహుస్వల్పము. ప్రకాశవర్షుఁడు, 'సరస్వతీకంఠాభరణము'నకు వ్యాఖ్యలు వ్రాసిన రత్నేశ్వర- జగద్ధర- భట్టనరసింహు లను పండితప్రకాండు లేతన్మతమును బాగుగ నవగాహనము చేసికొనఁగలిగిరి. అందువలన ప్రకాశవర్షునికృతిలోఁ బ్రధానమగురసప్రకరణము చాల భాగ మత్యన్న మగుట శోచనీయము.

— 7. భామహుఁడు-ప్రకాశవర్షుఁడు. —

ప్రకాశవర్షున కుపజీవ్యు లగుప్రాచీనాలంకారికులలో భామహుఁడొకఁడు. భామహునికావ్యాలంకారమునుండి యాతఁడు కొన్నిశ్లోకముల యథాస్థితములుగాఁ బరిగ్రహించియున్నాఁడు. మఱికొన్ని భామహశ్లోకములకు నీతనిశ్లోకములకు విశేషసామ్యము పొడకట్టుచున్నది. 3 వ పరిచ్ఛేదమున (37 శ్లో.) మహాభామహుని దని యొకశ్లోకము నుదాహరించెను. ఇది మనకు లభించినభామహగ్రంథమునఁ గానరాదు. అందీశ్లోకము లోపించెనో లేక ప్ర. వ. పొరపాటున మఱియొకకవిరచనము నీతని కంటఁగట్టెనో చెప్పఁజాలము. రసార్ణవమున [౪ పరి. 91-92 శ్లో. 'ప్రతిబింబమపి', 'రూపం శంసన్తి'] రెండుశ్లోకములలో భామహుని మతము ప్రమాణీకరించుకొనఁబడెను. ఈశ్లోకములు గూడ భామహునికృతిలో మృగ్యములు. దీని నాధారముగాఁ గొని వేంకటరామశర్మగారు మహాభామహుఁ డనునాలంకారికుఁ డొకఁడు గలఁ డనియు, నీతఁడు భామహునికంటె భిన్నుఁ డనియుఁ బ్రతిపాదించిరి. కాని యీ వాదము సమంజసము కాదని తరువాత నిరూపింపఁబడును. ఇఁక భామహప్రకాశవర్షులరచనాసామ్యములఁ జూడఁదగును—

(అ) ఈక్రిందిశ్లోకము లిరువురగ్రంథములలోను గలవు:

1. శ్లో. 'సముదాయార్థశూన్యం యత్ తదపార్థం ప్రచక్షతే.'

—భామహ. IV. పరి. 8 శ్లో. ప్రకాశ. ౧ పరి. 81.

2. శ్లో. 'క్వచి దాశ్రయసౌన్దర్యా ద్ధత్తే శోభా మసాధ్వపి
కాంతావిలోచనన్యస్తం మలీమసమి వాఞ్జనమ్.'
శ్లో. 'సన్నివేశవిశేషాత్తు దురుక్త మపి శోభతే
నీలం పలాశ మాబద్ధ మన్తరాలే స్రజా మివ.'
—భామహ. I. 55-54. ప్రకాశ. ౨. 50-51.

3. శ్లో. 'సర్వం సర్వేణ సారూప్యం నాస్తి భావస్య కస్యచిత్
యథోపపత్తి కృతిభి రుపమాసం ప్రయుజ్యతే.
శ్లో. అఖణ్డమణ్డలః క్వేన్దుః క్వ కాన్తానన మద్యుతి
యత్కిఞ్చిత్కాన్తిసామ్యాత్తు శశినైవోపమీయతే.'
—భామహ. II. 43-44 ప్రకాశ. ౨. 64-65.

4. శ్లో. 'ఏతద్గ్రాహ్యం సురభికుసుమం మాల్య మేత న్నిధేయమ్
ధత్తే శోభాం విరచిత మిదం స్థాన మస్యైత దస్య
మాలాకారో రచయతి యథా సాధు విజ్ఞాయ మాలామ్
యోజ్యం కావ్యే ష్వవహితధియా తద్వదే వాభిధానమ్.'
—భామహ. I. 59. ప్రకాశ. 3. 97.

(అ) ఉభయులకు విశేషసాదృశ్యముగల రచనలు:

1. 'య దభిన్నార్థ మన్యోన్యం త దేకార్థం ప్రచక్షతే.'—భామహ. IV. 12.
'ఉక్తాభిన్నార్థ మేకార్థం వ్యాహరన్తి విశారదాః.'—ప్రకాశ. ౧. 32.
2. 'యథోపదేశం క్రమశో నిర్దేశోఽత్ర క్రమో మతః
తదపేతం విపర్యాసా దిత్యాఖ్యాత మపక్రమమ్.'—భామహ. IV. 20.
'అపక్రమం తు తద్యత్ర పౌర్వాపర్యవిపర్యయః.'—ప్రకాశ. ౧. 33.
3. 'అవిద్వదఙ్గనాబాలప్రతీతార్థం ప్రసాదవత్'.—భామహ. II. 3.
'ప్రసిద్ధార్థపదన్యాసా త్ప్రసాద ఇతి కీర్తితః.'—ప్రకాశ. ౨. 7.
4. 'న కాన్త మపి నిర్భూషం విభాతి వనితాననమ్'—భామహ. I. 13.
'జ్ఞేయోఽలఙ్కారయోగోఽయం కామినీవపుషో యథా
నిసర్గసున్దర స్యాపి ప్రకర్షాధాయకో ధ్రువమ్.'—ప్రకాశ. 3. 2.
5. 'వినయేన వినా కా శ్రీః కా నిశా శశినా వినా
రహితా సత్కవిత్వేన కీదృశీ వాగ్విదగ్ధతా.'—భామహ. I. 4.
'వినయేన వినా కా శ్రీః కానిశా శశినా వినా
వినాచ శ్లేషచిత్రాభ్యాం కీదృశీ వాగ్విదగ్ధతా.'—ప్రకాశ. 3. 80-81.

— 8. దండి-ప్రకాశవర్షుఁడు. —

ప్రకాశవర్షుని కుపజీవ్యగ్రంథములు భోజుని 'సరస్వతీకంఠాభరణ-శృంగారప్రకాశములు.' 'సరస్వతీకంఠాభరణము'న దండి'కావ్యాదర్శము' నుండియు, భామహుని 'కావ్యాలంకారము' నుండియు శ్లోకములు చాలవఱకును, రాజశేఖరుని 'కావ్యమీమాంస' నుండి కొన్ని శ్లోకములును సంగ్రహింపఁబడినవి. భోజుని యీకృతి మనకవికి నొఱవడి యగుటచే దండి- భామహ- రాజశేఖరుల రచనలకు నీతనిరచనలకు విశేషసామ్యసాదృశ్యములు కానఁబడుటలో వింతలేదు. ప్రకృతము దండి-ప్రకాశవర్షులరచనాసామ్యముల నరయుదము:

(అ) ఈక్రిందిభాగము లుభయులకృతులలోను గానవచ్చెడివి:—

1. 'సముదాయార్థశూన్యం య త్తదపార్థం ప్రచక్షతే'

—దండి. III. 128; ప్రకాశ. ౧. 31.

2. 'ఓజ స్సమాసభూయ స్త్వమ్.'—దండి. I. 80. ప్రకాశ. ౨. 17.

3 'యత్రోద్వేగో న ధీమతాం.'—దండి. II. 51. ప్రకాశ. ౨. 62.

4. 'అస్తి కాచి దవస్థా సా సాభిషఙ్గస్య చేతసః
యస్యాం భవే దభిమతా విరుద్ధార్థాపి భారతీ.'

—దండి. III. 133. ప్రకాశ. ౨. 88.

5. 'ఇహ శిష్టానుశిష్టానాం శిష్టానా మపి సర్వథా
వాచా మేవ ప్రసాదేన లోకయాత్రా ప్రవర్తతే.
ఇద మన్ధం తమః కృత్స్నం జాయేత భువనత్రయమ్
యది శబ్దాహ్వయం జ్యోతి రాసంసారా న్న దీప్యతే'

—దండి. I. 3, 4. ప్రకాశ. 3. 67-68.

6. 'అనుకమ్పా ద్యతిశయో యది కశ్చి ద్వివక్ష్యతే
న దోషః పునరుక్తోఽపి ప్రత్యుతేయ మలఙ్కృతిః.'

—దండి. III. 137. ప్రకాశ. ౨. 55-56.

7. 'క్రీడా గోష్ఠీవినోదేషు తజ్జ్ఞై రాకీర్ణమన్త్రణే
పరవ్యామోహనే చాపి సోపయోగాః ప్రహేలికాః.'

—దండి. III. 97. ప్రకాశ. 3. 82.

8. 'న సంహితాం వివక్షామి త్యసన్ధానం పదేషు యత్
తద్విసన్ధీతి నిర్దిష్టం న ప్రగృహ్యాదిహేతుకమ్.'
—దండి. III. 159. ప్రకాశ. ౨. 54-55.

(ఆ) దండి-ప్రకాశవర్షులకృతులలో విశేషసాదృశ్యముగల వాక్యములు.

1. 'అవిశేషేణ పూర్వోక్తం యది భూయోఽపి కీర్త్యతే
అర్థతః శబ్దతో వాపి తదేకార్థం మతం యథా.'—దండి. III. 135.
ఉక్తాభిన్నార్థమేకార్థం వ్యాహరన్తి విశారదాః'.—ప్రకాశ. ౧. 32.
2. 'లోకాతీత ఇవాత్యర్థ మధ్యారోప్య వివక్షితః
యోఽర్థస్తే నాతితుష్యన్తి విదగ్ధా నేతరే జనాః.'—దండి. II. 89.
'లోకాతీత ఇవార్థో యః సోఽతిమాత్ర ఇహేష్యతే.'—ప్రకాశ. ౧. 34.
3. 'స్యా ద్వపుః సున్దర మపి శ్విత్రేణైకేన దుర్భగమ్.'—దండి. I. 7.
'న హి కుస్తాదిభి ర్దోషై రహితం కామినీవపుః
నృత్తగీతాదిచాతుర్యగుణా న్నాద్రియతే క్వచిత్.'—ప్రకాశ. ౨. 2.

గ్రంథగౌరవభీతిచే నిక దండివాక్యముల మాత్ర ముదాహరించి ప్రకాశవర్షుని వాక్యముల దిక్ప్రదర్శనముగ సూచించెదను.

4. 'ప్రసాదవత్ ప్రసిద్ధార్థమ్'.—దండి. I. 45.
'ప్రసిద్ధార్థ.'—ప్రకాశ. ౨. 7.
5. 'సమం బన్ధే ష్వవిషమం తే మృదుస్ఫుటమధ్యమాః
బన్ధా మృదుస్ఫుటోన్మిశ్రవర్ణవిన్యాసయోనయః.'—దండి. I. 47.
'బన్ధో మృదు'—ప్రకాశ. ౨. 8.
6. 'అనిష్ఠురాక్షరప్రాయం సుకుమార మిహేష్యతే.'—దండి I. 69.
'అకఠోరాక్షర'—ప్రకాశ. ౨. 9.
7. 'ఊర్జస్వి రూఢాహంకారమ్'—దండి. II. 275.
'రూఢాహంకార తోర్జిత్యమ్'—ప్రకాశ. ౨. 29.
8. 'యత్నః సమ్బన్ధవిజ్ఞానహేతుకోఽపి కృతో యది
క్రమలఙ్ఘన మ ప్యాహుః సూరయో నైవదూషణమ్.'—దండి. III. 146.
'యత్నః సమ్బన్ధ'—ప్రకాశ. ౨. 53-54.
9. 'శిథిలమ్ * * *
అనుప్రాసధియా గౌడై స్తదిష్టం బన్ధగౌరవాత్.'—దండి. I. 43-44.
'సుకుమారార్థ'—ప్రకాశ. ౨. 67.

10. 'ఉన్మత్తమత్తబాలానా ముక్తే రన్యత్ర దుష్యతి.'—దండి. III. 128.
'మత్తోన్మత్తాది.'—ప్రకాశ. ౨. 74.

11. 'ఈదృశం సంశయాయైవ యది జాతు ప్రయుజ్యతే
స్యా దలంకార ఏ వాసౌ న దోష స్తత్ర తద్యథా.'—దండి III. 141.
'సంశయాయైవ.'—ప్రకాశ. ౨. 76-77.

12. 'కాన్తం భవతి సర్వస్య లోకయాత్రానువర్తినః'.—దండి. I. 88.
'కాన్తం భవతి సర్వస్య లోకసీమానువర్తినః.'—ప్రకాశ. ౨. 79.

13. 'తత్ర వైదర్భగౌడీయౌ వర్ణ్యేతే ప్రస్ఫుటాన్తరౌ.'—దండి. I. 48.
'ఉచ్యన్తే రీతయస్తత్ర తథాపి ప్రస్ఫుటాన్తరాః'—ప్రకాశ. 3. 17.

14. 'కారకజ్ఞాపకౌ హేతూ తౌ చానేకవిధౌ యథా.'—దండి. II. 235.
'అలఙ్కారతయోద్దిష్టం నివృత్తావపి తత్సమమ్.'— „ 237.
నిర్వర్త్యే చ వికార్యే చ హేతుత్వం తదపేక్షయా
ప్రాప్యే తు కర్మణి ప్రాయః క్రియాపేక్షైవ హేతుతా.
హేతు ర్నిర్వర్తనీయస్య దర్శితః...... „ 240-41.
'* * * రమ్యా జ్ఞాపకహేతవః
అభావహేతవః కేచి ద్వ్యాహ్రియన్తే మనోహరాః'—„ 246.
'ప్రాగభావాదిరూపస్య హేతుత్వ మిహ వస్తునః
భావాభావస్వరూపస్య కార్యస్యోత్పాదనం ప్రతి.'—„ 252.
'దూరకార్య స్తత్సహజః కార్యానన్తరజస్తథా.'* *—„ 253-59.
ప్రకాశ. ౪. 11-13:—
'ప్రవృత్తేర్వా * * * క్వ వ్యర్థాన్తరబాధితః.'

15. 'సౌక్ష్మ్యా త్సూక్ష్మ ఇతి స్మృతః'—దండి. II. 260.
'సూక్ష్మః సూక్ష్మగుణస్తు సః'—ప్రకాశ. ౪. 14.

16. 'కిఞ్చి దారభమాణస్య కార్యం దైవవశాత్ పునః
తత్సాధనసమాపత్తి ర్యా తదాహుః సమాహితమ్.'—దండి. II. 298.
'* * ప్రయత్నాద్వా * * సమాహితమ్.'—ప్రకాశ. ౪. 18.

17. 'ప్రసిద్ధహేతువ్యావృత్త్యా యత్కిఞ్చి త్కారణాన్తరమ్
యత్ర స్వాభావికత్వం వా విభావ్యం సా విభావనా.'—దండి. II. 199.
'ప్రసిద్ధహేతు * * * విభావనా.'—ప్రకాశ. ౪. 19-20.

—9. భోజుఁడు-ప్రకాశవర్షుఁడు.—

భోజుని 'సరస్వతీకంఠాభరణము'ను, 'శృంగారప్రకాశము'ను ప్రకాశవర్షుని కృతిదర్పణమునకుఁ గళాయివంటివి. భోజుని యడుగుల లోనే యడుగులు వేసి మనకవి గ్రంథరచనము చేసెను; కాని యాతఁడు గ్రంథమున నొక్కచోనైనను భోజుని స్మరించినపాపమునఁ బోలేదు. భోజునిసరస్వతీకంఠాభరణమునకు 'రసార్ణవము' నిపానము వంటిది. 'శృంగారప్రకాశ' సారముగూడ నిం దిమిడి యున్న దనియు భోజునికృతికి ప్రకాశవర్షునిగ్రంథము సింహావలోకనమువంటి దనియుఁ జెప్పనొప్పును. ఇఁక మనకవి యుపజ్ఞ యేమన-భోజుని రచనముల నెడనెడ వ్యత్యస్తము చేయుట, యాతఁడు నుడివిన గుణదోషాదులలో నొండు రెండు వదలి వేయుట, యాతఁడుచెప్పిన వాని కొకటిరెండు చేర్చుట యాతఁడు పెట్టిన పేరును మార్చి మఱొకపదము చే నావిషయమునే చెప్పుట మొక లగునవి. ఇఁక వారిరువుర రచనాసామ్యములలోఁ గొన్నిటిని మాత్రము చూపి పిమ్మటఁ గొన్నివిషయముల సమాలోచ మొనరించెదను.

—భోజుఁడు—	—ప్రకాశవర్షుఁడు.—
I పదదోషములు: 16.	I పదదోషములు: 14. క్రమమున నించుకవ్యత్యాసము గలదు.
1. అసాధువు: ('శబ్దశాస్త్రవిరుద్ధం యత్.')	1. ('శబ్దశాస్త్రవిరుద్ధం యత్.')
2 అప్రయుక్తము: ('కవిభి ర్నప్రయుక్తం యత్.')	2. ('నప్రయుక్తం కవీన్ద్రై ర్యత్.')
3. కష్టము: ('పదం శ్రుతే రసుఖదమ్.')	3. ('శ్రవణదుర్భగమ్.')
4. అనర్థకము: ('పాదపూరణమాత్రార్థమ్'.)	4. ('పాదపూరణమాత్రం యత్.')
5. అన్యార్థము:('రూఢిచ్యుతంపదంయత్'.)	5. [ఈక్రింది 'యసమర్థ' లక్షణము దీనికి సదృశముగా నున్నది.]
6. అపుష్టార్థము: ('యత్తు తుచ్ఛాభిధేయం స్యాత్.')	6. ('వాచ్యతుచ్ఛతయా క్లిష్టమ్.')
7. అసమర్థము: ('అసఙ్గతం పదం యత్.')	7. ('య ద్విరుద్ధం రూఢివర్త్మవ్యతిక్రమాత్.')—భోజుని 'అన్యార్థము' దీనికిఁ దుల్యముగా నున్నది.

8. అప్రతీతము: ('తదుద్దిష్టం, ప్రసిద్ధం శాస్త్ర ఏవ యత్.')	8. ('శాస్త్ర ఏవ ప్రయుక్తం యత్.')
9. క్లిష్టము: ('దూరే యస్యార్థసంవిత్తిః.')	9.('పారంపర్యేణచార్థస్యసూచకమ్.')
10. గూఢార్థము:('అప్రసిద్ధార్థప్రయోగమ్..)	10. ('అప్రసిద్ధార్థసంబద్ధమ్.')
11. నేయార్థము: ('స్వసంకేతప్రక్లృప్తార్థమ్ ')	11. ('స్వయం కల్పితసంకేతమ్.')
12. సందిగ్ధము: ('నయత్పదం నిశ్చయకృత్.')	12. ('యత్రార్థాన్తరసమ్భవః.')
13. విపరీతము: ('విరుద్ధార్థప్రకల్పనమ్.')	13. [ప్రకాశవర్షుఁడు పేర్కొనలేదు.]
14. అప్రయోజకము:('అవిశేషవిధాయకమ్.')	14. ('వివక్షితప్రమేయస్య నోపకారి.')
15. దేశ్యము: ('అవ్యుత్పత్తిమత్పదమ్.')	15. ('దేశరూఢిగతం పదమ్.')
16. గ్రామ్యము:i. అశ్లీలము(లేక)అసభ్యార్థము	16. గ్రామ్యము: i అసభ్యము.
ii. అమంగళము.	ii అమంగళము.
iii. ఘృణావత్తు.	iii ఘృణాకరము.
—భోజుఁడు.—	—ప్రకాశవర్షుఁడు.—
II. వాక్యదోషములు: 16.	వాక్యదోషములు: 14, కాని సరిగా నాలోచించిన 15 కానఁబడుచున్నవి. క్రమమున నించుక వ్యత్యాసము గానఁబడుచున్నది.
1 శబ్దహీనము: ('అపశబ్దవత్.')	1. 'భిన్నభాషాపదావిద్ధమ్.'
2. క్రమభ్రష్టము: ('అర్థః శబ్దో వా యత్ర న క్రమః.')	2. 'శబ్దార్థవ్యుత్క్రమో యత్ర.'
3. విసంధి: ('విసంహితో విరూపో వా యత్ర సన్ధిః.)	3. 'విరుద్ధసన్ధి నిః సన్ధి.'
4. పునరుక్తిమత్తు: ('పదం పదార్థశ్చాభిన్నౌ యత్ర.')	4. 'తాదృక్పదపదార్థానాం నిబన్ధే.'
5. వ్యాకీర్ణము: ('మిథో యస్మిన్ విభక్తీనా మసఙ్గతిః.')	5 'అనేకపదసన్తానవాక్యహాతస్మృతిభిః పదైర్యోజనా యత్ర.'
6. సంకీర్ణము: ('వాక్యాన్తరపదైర్మిశ్రమ్.')	6. 'వాక్యాన్తరపదోన్మిశ్రమ్.'
7. అపదము: ('విభిన్నప్రకృతిస్థాది పద యుక్తిః.')	7. * * *
8. వాక్యగర్భితము: ('వాక్యాన్తరసగర్భమ్ యత్.')	8. [వాక్య] గర్భితము: ('వాక్యాన్తరసుగర్భం యత్.')

9. భిన్నలింగము: ('యత్రోపమా భిన్న లిఙ్గా.')	9. 'అలిఙ్గత్వా దుపమానోపమేయయోః'.
10. భిన్నవచనము:('యద్భిన్నవచనోపమమ్.')	10. 'యస్మిన్ వచనవైషమ్య ముపమానోపమేయయోః.'
11. న్యూనోపమ: ('న్యూన ముపమానవిశేషణైః.')	11. 'న్యూనై రుపమానవిశేషణైః.'
12. అధికోపమ: ('అధికం యత్పునస్తైః స్యాత్.')	12. 'విశేషణాధికౌపమ్యమ్'.
13. భగ్నఛందస్సు:('యచ్ఛన్దోభఙ్గవద్వచః'.)	13. భిన్నవృత్తము: (ఛన్దోలక్షణహీనం'.)-2 విధములు: 'తద్వర్ణ-యతి-భేదేన ద్విధా'.
14. భగ్నయతి: ('అస్థానే విరతి ర్యస్య.')	14. ఖంజము: ('క్రియావిరహితం వాక్యమ్'.)
15. అశరీరము:('క్రియాపదవిహీనం యత్.')	15. శ్లేషాదిగుణహీనము-10 తెగలు. సమాధిగుణహీనముతోఁ గలిపి.
16. అరీతిమత్తు: (గుణానాం దృశ్యతే యత్ర శ్లేషాదీనాం విపర్యయః.')-సమాధి తప్పఁ దక్కిన 9 గుణములు విపర్యయమునందు టమబట్టి అరీతిమత్తు 9 విధములు.	

III. వాక్యార్థదోషముల విధానము, వర్గీకరణములలో నుభయులకు నిదివఱకుఁ జూపినసామ్యముకంటె నధికసామ్యము గన్పట్టుచున్నది:-

—భోజుఁడు.—	—ప్రకాశవర్షుఁడు—
వాక్యార్థదోషములు: 16.	వాక్యార్థదోషములు: 16.
1. అపార్థము: ['సముదాయార్థశూన్యం యద్వచః.']	1. 'సముదాయార్థశూన్యం యత్'.
2. వ్యర్థము:['గతార్థం యత్, యచ్చ స్యాన్నిష్ప్రయోజనమ్.']	2. 'యదప్రయోజనం (కిం ?) యచ్చ గతార్థమ్'.
3. ఏకార్థము: ['ఉక్త్యభిన్నార్థమ్.']	3. 'ఉక్త్యభిన్నార్థమ్'. ('ఉక్తాభిన్నార్థమ్'-సరికాదు.)
4. ససంశయము: ['సందిగ్ధార్థమ్.']	4. 'యత్రార్థస్య న నిశ్చయః'.

5. అపక్రమము: [‘వాక్యం యత్ర క్రమభ్రష్టమ్.’]	5. ‘పౌర్వాపర్యవిపర్యయః’.
6 భిన్నము: [‘జాత్యాద్యుక్తావనిర్వ్యూఢమ్.’)	6. ‘జాత్యాద్యుక్తావనిర్వ్యూఢమ్’.
7. అతిమాత్రము: [‘యత్ సర్వలోకాతీతార్థమ్.’]	7. ‘లోకాతీత ఇవార్థో యః’.
8. పరుషము: [‘యత్తు క్రూరార్థమత్యర్థమ్ ’]	8. ‘అతిక్రూరస్తు వాక్యార్థః’.
9. విరసము: [‘అప్రస్తుతరసం యత్.’]	9. ‘అప్రాకృతరసమ్’.
10. హీనోపమ: [‘హీనం యత్రోపమానం స్యాత్.’]	10. ‘హీనం యత్రోపమానం స్యాత్ ’.
11. అధికోపమ: [‘తదేవ యస్మిన్నధికమ్.’]	11. ‘యత్రోపమానమధికమ్’.
12. అసదృశోపమ: [‘యత్త్వతుల్యోపమానకమ్.’]	12. విసదృశోపమ: ‘అతుల్యముపమానం చేత్.’
13. అప్రసిద్ధోపమ: [‘అప్రసిద్ధోపమానం యత్.’]	13. ‘అప్రసిద్ధోపమానం చేత్’.
14. నిరలంకారము: [‘యదలఙ్కారహీనమ్.’]	14. ‘అలఙ్కారవివర్జితమ్’.
15. అశ్లీలము: [అశ్లీలార్థప్రతీతికృత్.’]	15. ‘యదసభ్యార్థసంబద్ధమ్’.
16. విరుద్ధము: 3 విధములు—	16. విరుద్ధము: 3 విధములు—
౧. ప్రత్యక్షవిరుద్ధము.	౧ ప్రత్యక్షము.
౨. అనుమాన ,,	౨. అనుమానము.
3. ఆగమ ,,	3. ఆగమము.
ఈమూటిలో నొక్కొకటి 3 తెఱఁగులు; మొత్తము 9.	ఈమూటిలో నొక్కొకటి మరల 3 విధములు. మొత్తము 9.

దోషములు, తల్లక్షణములు కేవలము భోజునికృతియందే కాక తత్పూర్వాలంకారికులకృతులలోను గానఁబడుచున్నవి; కావున దోషలక్షణములు, తద్రచనాక్రమమును ప్రాచీనులచే స్థిరరూప మొసఁగఁబడినవి. అందుచే శబ్దసాదృశ్యము రచనాసామ్యము దోషప్రకరణమునఁ దప్పవు. కేవలము నీసామ్యములఁబట్టియే యొకగ్రంథకర్త మఱొకనికృతి నుపజీవ్యముగాఁ గొనెనను సిద్ధాంతము సమజంసము కాదని కొందఱు వాదింపవచ్చును. కాని గుణప్రకరణమునందలి సామ్యములం జూచుచో

భోజునికృతి యెంతవఱకు ప్రకాశవర్షునకు మూలమో తెలియఁగలదు. దండి, తదనుయాయుల ప్రభావమును, అగ్నిపురాణమునందలి యలంకారప్రకరణములందలి మతప్రభావమును భోజుని యభిప్రాయములపైఁ జాలవఱకు గప్పట్టినను, నీతనికృతియందుఁ జేర్పఁబడిన 'గుణముల' నామములును గుణనిర్ణయపద్ధతియు విలక్షణములై, తత్పూర్వకృతుల లోని వాని కనేకవిషయముల భిన్నములై చూపట్టుచున్నవి. ఇక్కడను ప్రకాశవర్షుఁడు భోజుని విశేషముగా ననుకరించెను:

1. శ్లేష. 2. ప్రసాదము. 3. మాధుర్యము. 4. సమత. 5. సౌకుమార్యము. 6. అర్థవ్యక్తి. 7. ఓజస్సు. 8. కాంతి. 9. ఉదారత. 10. సమాధి - అని వామనునిచేఁ జేర్పఁబడిన శబ్దార్థగుణములు పదింటికి భోజుఁడు- 11. ఔర్జిత్యము. 12. ఉదాత్తత. 13. ప్రేయస్సు. 14. సుశబ్దత. 15. సౌక్ష్మ్యము. 16. గాంభీర్యము. 17. సంక్షేపము. 18. విస్తరము. 19. సమ్మితత్వము. 20. భావికత్వము. 21. రీతి. 22. ఉక్తి. 23. గతి. 24. ప్రౌఢి -

అను 14 గుణములఁ జేర్చి మొత్తము గుణములు 24 అనెను. ఈతనివలె నింతవిలక్షణముగ నిన్నిగుణములను మఱి యేయాలంకారికుఁడును జెప్పియుండలేదు.

ప్రకాశవర్షుఁడుమాత్ర మిందలి గతి-ప్రౌఢి అనువానిని వదలి తక్కిన 22 గుణముల నామముల లక్షణములను భోజునికృతినుండి సంగ్రహించెను.

—భోజుఁడు.—	—ప్రకాశవర్షుఁడు.—
IV శబ్దగుణములు: 24.	శబ్దగుణములు: 22.
1. శ్లేషః ('సుశ్లిష్టపదతా')	1. 'యత్ర బన్ధోఽతి సంశ్లిష్టః.'
2. ప్రసాదము: ('ప్రసిద్ధార్థపదత్వమ్.')	2. 'ప్రసిద్ధార్థపదన్యాసః.'
3. సమతః ('యన్మృదుప్రస్ఫుటోన్మిశ్రవర్ణ బన్ధవిధింప్రతి, అవిషమ్యేణభణనమ్'.)	3. 'బన్ధోమృదుస్ఫుటోన్మిశ్రవర్ణజన్మా న సబ్కారః.'

4. మాధుర్యము: ('యాపృథక్పదతా వాక్యే')	4. 'అర్థోచితవచోబన్ధః.'
5. సుకుమారత: ('అనిష్ఠురాక్షరప్రాయమ్'	5. 'అకఠోరాక్షరన్యాసః.'
6. అర్థవ్యక్తి: ('యత్రసమ్యాగ్ణవాక్యత్వ'మ్)	6. 'సమ్యాగ్ణవాక్యతా.'
7. కాంతి: ('యదుజ్జ్వలత్వం బన్ధస్య.')	7. 'బన్ధస్యోజ్జ్వలతా.' [ఇటు గ్రంథ పాఠము గలదు.]
8 ఔదార్యము: ('వికటాక్షరబన్ధత్వమ్.')	8. 'బన్ధవైకట్యమ్.'
9. ఉదాత్తత: ('శ్లాఘ్యైర్విశేషణైర్యోగః')	9. 'శ్లాఘ్యైర్విశేషణైర్యుక్తమ్.'
10. ఓజస్సు: ('సమాసభూయస్త్వమ్.');	10. 'సమాసభూయస్త్వమ్.'
11 ఔర్జిత్యము: (గాఢబన్ధతా'.)	11. 'బన్ధగాఢత్వమ్.'
12. ప్రేయస్సు: ('ప్రియతరాఖ్యానం చాటూక్తౌ')	12. 'ప్రేయార్థపదవిన్యాసః.'
13. సుశబ్దత: ('వ్యుత్పత్తిః సుప్తిఙాంయా.)'	13. 'యాసుబన్తతిఙన్తానాంవ్యుత్పత్తిః.
14. సమాధి: ('అన్యధర్మాణాం యదన్యత్రాధిరోపణమ్.')	14.'అన్యధర్మస్యథవేదస్యత్రరోపణమ్.'
15. సౌక్ష్మ్యము: ('అన్తస్సంజల్పరూపత్వం శబ్దానామ్.')	15. 'శబ్దానా మన్తస్సంజల్పరూపతా.'
16. గాంభీర్యము: ('ధ్వనిమత్తా'.)	16. 'ధ్వనిమత్తా.'
17. విస్తరము: ('వ్యాసేనోక్తిః.')	17. 'వ్యస్తమ్.'
18. సంక్షేపము: ('సమాసేనాభిధానమ్.')	18. 'అభిధానం సమాసేన.'
19. సమ్మితత్వము: ('యావదర్థపదత్వమ్.')	19. 'యావదర్థపదత్వమ్.'
20. భావికత్వము: ('భావతో వాక్యవృత్తి ర్యా.')	20. 'భావాభివ్యఞ్జకా వాణీ.'
21. గతి: ('క్రమో యఃస్యా దరోహావరో హ యోః')	21. * * * *
22. రీతి: ('ఉపక్రమస్యనిర్వాహః'.)	22. 'ఉపక్రమస్యనిర్వాహః.'
23. ఉక్తి: ('విశిష్టా భణితి ర్యా స్యాత్'.)	23. 'అర్థాన్తరేణ చార్థస్య భణనాత్.' [మొదటి రెండక్షరములు లోపింప శర్మగారు 'వినా' అని పూరించిరి, 'డే' పండితులు 'అర్థ' అని పూర్తి చేసిరి.]
24. ప్రౌఢి: ('ఉక్తేః ప్రౌఢః పరీపాకః'.)	24. * * * *

అర్థగుణములు, దోషములు కొన్నియెడల గుణత్వము నొందుట మొదలగు ననేకవిషయములలోఁ గూడ భోజునికృతికి ప్రకాశవర్షునికృతికి ననేకసామ్యములు కానఁబడుచున్నవి. ఇంచుమించుగా నీహరణము రసార్ణవమున నామూలచూడము చూపట్టుచునేయుండును.

—10. పిన్నడి.—

శార్ఙ్గధరుని 'పద్ధతి' లో ప్రకాశవర్షునిశ్లోకములు రెం డుదాహరింపఁబడి యున్నవి [383; 783 శ్లో]. ఈశ్లోకములు వల్లభదేవుని 'సుభాషితావళి' లోఁగూడ [484; 834]. ప్రకాశవర్షున కారోపింపఁబడి యున్నవి. ఇవికాక మఱి 27 శ్లోకములు ప్రకాశవర్షకృతములుగా 'సుభాషితావళి' లో లభించుచున్నవి. బాగుగా విమర్శింపఁగా నీసుభాషితగ్రంథములలోఁ బేర్కొనఁబడినప్రకాశవర్షుఁడు ప్రాచీనవ్యాఖ్యాతయగు ప్రకాశవర్షుఁడు కాఁడనియు, 'రసార్ణవ'కర్తయగు మనప్రకాశవర్షుఁడే యనియు దృఢప్రత్యయము కలుగుచున్నది. ఏమన నాలంకారికులైన వారు కవులుగాఁ గూడఁ గన్పట్టుచున్నారుగాని, సామాన్యముగా వ్యాఖ్యాతలైనవారు కవినామప్రసిద్ధి నొందుటలేదు. ఉత్తమసాహిత్యకృతికర్తలగు దండి, ఉద్భటుఁడు, రాజశేఖరుఁడు, భోజుఁడు, క్షేమేంద్రుఁడు, విశ్వనాథకవిరాజు, విద్యానాథుఁడు, ధర్మసూరి, జగన్నాథపండితరాయలు మొదలగుమహనీయు లందరును గవిచంద్రులుగాఁ గూడఁ బ్రఖ్యాతులు. మల్లినాథాదు లేవో కొన్నిముక్తకశ్లోకము లల్లినను వీరికి వ్యాఖ్యాతలనియే కాని కవులని ప్రసిద్ధి కలుగలేదు. కావునఁ బైసుభాషితకోశములలోఁ బేర్కొనఁబడినకవి 'రసార్ణవ' కర్తయే యని నిశ్చయింపవచ్చును. మఱియు క్రీ. శ. 1200 కంటె నవీనము కాదని నిశ్చయింపఁబడిన 'కవీంద్రవచనసముచ్చయము'న ప్రకాశవర్షునిశ్లోకము లేమియుఁ గానరావు. ఇందువలనఁ గూడ సుభాషితావళిలో నుల్లేఖింపఁబడినకవి మనకవి యనియే నిర్ణయింపనగును. ఈసిద్ధాంతము సరియగుచో ప్రకాశవర్షునికాలమున కుత్తరావధి మనకు లభించుచున్నది. ధర్మదాససూరి 'విదగ్ధముఖమండనము'ను బేర్కొనుటచే 'రసా

ర్ణవ' కారుఁడు క్రీ. 1210 కంటె నవీనుఁడని కాలనిర్ణయప్రకరణమునఁ జెప్పఁబడినది. 'శార్ఙ్గధరపద్ధతి' రచనాకాలము క్రీ. 1363. ఇది 'సుభాషితావళి'కంటెఁ బ్రాచీనము. కావున నిందుదాహరింపఁ బడినప్రకాశవర్షుఁడు క్రీ. 1363 కంటెఁ బ్రాచీనుఁడని చెప్పవచ్చును. అనఁగా క్రీ. 1210-1363 నడుమ నీతఁడు జీవించియుండు ననుట సరియని తోఁచెడిని.

— అనుబంధము —

లోపపూరణములు-పాఠభేదములు.

౧. పరిచ్ఛేదము.

—అచ్చుప్రతి.—	—సవరణలు.—
3. శ్లో. దో ♦ ♦ పమితి.	దేశ్యంగ్రామ్యమితి. (స. క. I. 6. 4పు.)
6. తచ్ఛ ♦ ♦ దనర్థకమ్.	తదేవస్యా (?) దనర్థకమ్.
7. శాస్త్రస్ ♦ ♦ ♦ యుక్తం.	శాస్త్రష్వప్రయుక్తం. (స. క. I. 10. 9. పు.)
10. దేశ్య ♦ థవా (?) యన్న్యస్తం.	తద్దేశ్యమితినిర్దిష్టం యదవ్యుత్పత్తిమత్పదమ్ (స. క. I. 14. 13.పు.)
18. భిన్నలిఙ్గమలిఙ్గత్వాత్.	భిన్నలిఙ్గమలిఙ్గం యత్ (?)
27. ♦ ♦ శ్శబ్దార్థయోః.	పాకః శబ్దార్థయోః (స. క. 61 పు.)
34. జాత్యాదిశ్శక్తా ♦ ♦ ♦ థం.	జాత్యాదిశ్శక్తావనిర్వ్యూథం (స. క. 94 పు.)
42. తద్యత్ర ♦ ♦ ♦ న.	తద్యత్ర తద్దేశేన (?)
43. యద్య (థ ?) నో ♦ ♦	యద్యత్ర నోచితమ్ (?)

౨. పరిచ్ఛేదము.

1. శాస్త్రార్థ ♦ ♦ లాలోకః.	శాస్త్రార్థకుశలో లోకః (?)
2. దోషైః రహితం.	దోషైస్సహితం (?)
6. ఏవ ♦ ♦	ఏవ ప్రోక్తో (?)
10. బాధ్యన్తే.	బధ్యన్తే (?)
12. యోగినామ్.	యోగినమ్ (?)
15. బన్ధస్యో ♦ ♦ ♦ కాన్తిః.	బన్ధస్యోజ్జ్వలతా కాన్తిః (స. క. I. 69. 48 పు)
17. వ్యాస ♦ ♦ చ.	వ్యాస ఏవ చ (?)

18 ప్రేయూర్థ.	ప్రేమోఒర్థ (?)
29. సం ♦ ♦ ♦ జః.	సంయోగ మోజః (?)
34 క్రియాక్రమమ్.	క్రియాత్మకమ్ (?)
37. యథా న (ఈపాదమంతయు) తథా ♦ ♦ ♦ ణె.	తథా న (స. క. I. 4. 4 పు.) తథానుకరణే (?)
41. సందిగ్ధం... ...[ణః].	సందిగ్ధం తు ప్రకరణా ద్విశేషావక మో యది (స. క. I. 101.95. పు.)
44. ♦ ♦ ♦	సంప్రీతం (స. క. I. 105. 98 పు.)
45. శివలింగాదిశ ♦ ♦ ♦ స్యా.	శివలింగాది సంస్థానే కస్యా (స. క. 84 పు.)
49. ఘృ ♦ ♦ ♦	ధృ ♦ ♦ ♦ మ్.
51. ♦ ♦ వశ. ఈశ్లోకమునకుఁబిస్తుట.	సన్నివేశ (స. క. I. 107. 103 పు.) ఘృణార్థం స్మృతిహే ♦ ♦ పూర్వవ ద్గదితా గతిః.
54 విచత్స్యామా.	వివత్సామా. (స. క. I. 114. 107 పు.)
55. నప్రగృహ్య ♦ ♦ కమ్.	నప్రగృహ్యాదిహేతుకమ్. (స. క. I. 114. 107 పు.)
56. కృతిః	క్రియా (స. క. I. 115. 107 పు.)
57. సంయోగాదే ♦ ♦ ♦	సంయోగాదే రగౌరవమ్ (స. క. I. 123. 120 పు)
58. కృతా ♦ ♦	కృతానచేత్ (స. క. I. 121 పు.)
60. నదో...	నదోషాయ వాకోవాక్యవిదోవిదుః (స. క. I. 117. 109 పు.)
61. ... ...విదుర్బుధాః.	ద్గర్భితం తద్విదు ర్బుధాః. వాక్యా న్తరనగర్భం యద్వాక్యంతద్వా క్యగర్భితమ్. (స. క. I. 119.113 పు.)

62. ♦ ♦ ♦ భిన్న.	న దోషో భిన్న.
న భిన్నవచనే.	న భిన్నవచనో.
64. ♦ ♦ సర్వేణ.	సర్వం సర్వేణ (స. క. I. 109 పు.)
71. హాస్యాదా ♦ ♦ త్పన్న.	హాస్యాదా వప్యుత్పన్న (?)
77. అ (ధేద) మపి.	అపక్రమోఽపి.
82. దృశ్యోపమాన్య.	దృశ్యోపమ్య వ్య.
85. విరోధే.	విరోధో.
90. ♦ ♦ ♦ యో.	ప్రత్యవాయో.
91. నదో ♦ ♦ ♦	నదోషో రత్య.

3. పరిచ్ఛేదము.

3. ♦ ♦ సుస్వరస్యాపి.	విసర్గసుస్వరస్యాపి.
15. ప్రాకృతా.	ప్రాకృతా.
22. సమస్త ♦ ♦ ♦ ♦	సమస్తరీతిసంకీర్ణా (స.క.II.33. 157.)
24. సంబన.	సంబద్ధ.
29. తత్తాదృ.	తాం తాదృ.
32. భరతైః.	పురుష.
37. మిశ్రేతి తం.	మిశ్రేతి తాం.
61. ♦ ♦ ♦ ♦ తు	ఏకరూపా తు (స.క.II. 58. 197పు.)
62. ♦ ♦ ♦ తకమ్.	తద్వ్యపేతకమ్ (స. క. 187 పు.)
63. ♦ ♦ భ్యాసభవం.	అర్థాభ్యాసభవం (స. క. 187 పు.)
75. తం వినా.	తాం వినా.
90. నా ♦ ♦ తేషు.	నాభిజాతేషు (స.క. II. 8. 142 పు.)
94. ♦ ♦ ♦ గూర్జరాః.	నాన్యేనగుర్జరాః(స.క.II.13;142పు.)
95. గాకః.	గాఢః.
గాథాం ♦ ♦ స్తు.	గాథా మన్యాపాస్తు
97. ద్వితీయచరణము:	ధత్తే శోభాం విరచిత మిదం స్థాన మస్యైతదస్య. (భామహ. 1. 59.)
త ♦ ♦ ♦ భిధానమ్.	తత్తదేవాభిధానమ్ (భామహ.)

౪. పరిచ్ఛేదము.

5. నానావస్తుషు.	నానావస్థాసు (స.క. III. 4. 312 పు.)
రూపాణి • • •	రూపాణి వస్తునః. (స. క. 226 పు.)
6. మి • •	మియతా (స. క. III. 5. 312 పు.)
7. జహమెూ నమిపి వక్తి.	జాయమానప్రియం వక్తి (స. క. III. 5. 312 పు.)
మాత్రయే హేతుమితి త • ద.	మాత్రయో హేతు రితి తద్భేద. (స.క. III. 6. 312 పు.)
8. మథ (చ) •	మ వ్యవస్థానం (స. క. III. 7. 313 పు.)
9. వి • • స్త్రీ.	విసంగ్ధస్త్రీ (స. క. III. 7. 313. పు.)
10. దేశకాలకలాశక్తి • • నాని.	దేశః కాలశ్చ శక్తిశ్చ సాధనాని. (స. క. III. 8. 313 పు)
14. పత్ర. బాధితః.	పాత్ర. బోధితః.
16. • • • • • • హేతుః.	క్రియాయాః కారణం హేతుః. (స. క. III. 12. 320. పు.)
17. • • రస్య.	అపారస్య (?)
18. అ • • •	అప్రయత్నాత్ (స. క. 307 పు.)
20. స్యాద్య • • • •	వా స్యా ద్యత్ర సా స్యాత్. (స. క. III. 9. 3'8పు.)
37. విమిశ్రా • • • • •	విమిశ్రాం కావ్యకోవిదాః (స. క. 297 పు.)
39. సంశయా • • • తు	సంశయే నిర్ణయే స్తః (స. క. 314పు)
40. స్త • •	శ్రయత్నాత్ (స. క. 320 పు.)
41. ర్థచార్థాన్తరతః స్మృతేః.	ర్థ చా స్యార్థాన్తరం స్మృతేః. (స. క. 320 పు.)

47. కారణైరపి:	ఈశ్లోకము 'మాలాభ్రాన్తేః' అను (45 శ్లో.) పాదమునకుఁ బిమ్మటఁగలదు.
48. • • ప్య.	కమప్య.
67. సమాధిభి.	సామాదిభి.
74. 'క్వచిత్'- అను పాదము నకుఁ బిమ్మట:	'కస్మిన్నపి హి కోఽప్యర్థః కాలే యేనోప యుజ్యతే, తేన మన్యామహే కాల ముపయోగనిబన్ధనమ్'.
90. 'యత్ర' అను పాదమునకుఁ దరువాత:	'• • • త(?) ఉపమానమితి • (ప్రా?) శైరలఙ్కారస్సకథ్యతే, ఉపమానమితి ప్రోక్తో బుధై రభిహితోఽపి సః, య తోఽభినయా • • • సూచ్యం వస్తు ప్రతీయతే'.
93. లిఙ్గకః.	లిఙ్గకో:.
97. తుదిగద్యము-'ఇది'.	ఇతి.

౫. పరిచ్ఛేదము.

12. కామ • • • మాఙ్కురః. కామకల్పద్రుమాఙ్కురః.

విజయనగరమహారాజ-సంస్కృతకళాశాలయందలి 'రసార్ణవము' యొక్క వ్రాత ప్రతిని బరిశీలించి పాఠభేదముల వ్రాసికొనఁగిన తత్కళాశాలా సంస్కృతసాహిత్యాలంకారోపన్యాసకులు, వేదాంతశిరోమణి- శ్రీమత్పండిత కరవస్తు గోవిందాచార్యచరణులకు ధన్యవాదముల నర్పించుచున్నాను.

(ఈ. రా.)

శృంగారప్రకాశము: వ్రాతప్రతి చెన్నపురి 'ప్రాచ్యలిఖితగ్రంథాలయము' నఁగలదు.

సరస్వతీకంఠాభరణము: నిర్ణయసాగరముద్రాలయము(బొంబాయి)న ముద్రితములగు ప్రథమ(1925) ద్వితీయ(1934) సంస్కరణములుపయోగింపఁబడినవి. వ్యాఖ్యాకరములయొద్ద పుటసంఖ్యమాత్ర ముండిన నది మొదటికూర్పుప్రతి యనియుఁ బరిచ్ఛేదశ్లోకసంఖ్యకూడ నుండిన నది రెండవకూర్పుప్రతి యనియు నెఱుఁగునది.

'సుభాషితావళి' లో ప్రకాశవర్షునిశ్లోకములు 29 లభించు చున్నవి. ఈకవియు రసార్ణవకారుఁడు నభిన్నులు కావునఁ దత్కవితారచనకుఁ గొన్నిశ్లోకముల నుదాహరించెదను.

1. శ్లో. సహసిద్ధమిదం మహతాం ధనేష్వనాస్థా గుణేషు కృపణత్వమ్
పరదుఃఖే కాతరతా మహచ్చ ధైర్యం స్వదుఃఖేషు. (248 శ్లో.)

2. శ్లో. కృపణసమృద్ధీనామపి భోక్తారః సన్తి కేచి దతినిపుణాః
జలసమ్పదోఽమ్బురాశే ర్యాన్తి లయం శశ్వ దౌర్వాగ్నిః.
—సుభా. (484). శా. పద్ధతి. (383 శ్లో.)

3. శ్లో. ధనబాహుల్య మహేతుః కోఽపి నిసర్గేణ ముక్తకరః
ప్రావృషి కస్యామ్బుముచః సంపత్తిః కిమధికామ్బునిధేః. (522)

4. శ్లో. ఏతదత్ర కథితైకజీవితం, పశ్య శుష్యతి కథం మహాత్సరః
ధిఙ్ ముధామ్బుధర ! రుద్ధపద్ధతి, ర్వర్ధితా కిమిహ హట్టవాహినీ.
—సుభా. (834). శా. ప. (783).

5. శ్లో. కార్యజ్ఞః ప్రష్టవ్యో న పునర్మాన్యో మమప్రియో వేతి
గురురప్యాసనసేవ్యః ప్రియమానితమ్బః కదా మన్త్రీ. (2876).

6. శ్లో. గుణవానస్తి విదేశః క ఇవ మమేత్యేవ సురభిమానలవః
అఞ్జన మక్ష్ణి విరాజతి విన్యస్తం న పున రధరమణౌ. (2877).

7. శ్లో. స్తబ్ధప్రకృతి ర్లోకే బహుమాన ముపైతి నాతిశయనమ్రః
స్ఫుట మత్రోదాహరణం పయోధరః కువలయాక్షీణామ్. (2878)

ఆంధ్రసాహిత్యపరిషత్తు,

రజతోత్సవసభావృత్తాంతము.

ఈసభ కాకినాడలో శ్రీ పిఠాపుర రాజకళాశాలలో ఆగస్టు ది 7-8 తేదులలో జరిగినది. శ్రీ శ్రీ శ్రీ జయపురమహారాజాగారు, సాహిత్యసామ్రాడాదిబిరుదాంకితులు డాక్టరు శ్రీ విక్రమదేవవర్మబహద్దురువారగ్రాసనాధిపత్యమును వహించిరి. శ్రీ మహారాజావారు ది 6 వ తేది శుక్రవారము సాయంకాలమునకే విశాఖపట్టణమునుండి మెయిలుమీఁద విచ్చేసిరి. మ. జయంతి రామయ్యపంతులుగారు చామర్లకోటవఱకు నెదురేఁగి శ్రీవారినిదర్శించి కాకినాడకుఁ దోడ్కొనివచ్చిరి. అక్కడఁ బురప్రముఖులు దివాన్ బహద్దరు దురుసేటి శేషగిరిరావుపంతులుగారు, దివాన్ బహద్దరు కొమ్మిరెడ్డి సూర్యనారాయణమూర్తినాయఁడుగారు, శ్రీ పైండా వేంకట నారాయణ జమీందారుగారు, పెద్దాడరామస్వామిగారు, లక్కరాజు సుబ్బారావుపంతులుగారు, పరిషత్సభ్యులు, కార్యదర్శులు, నాహ్వానసంఘమువారు నెకర్లాని పుష్పాదిహారాలంకృతులఁ జేసి సన్మానపురస్సరముగ మంగళవాద్యములతోఁ బురంబేఁగించుచు శ్రీమహారాజావారిని బసకుఁ దీసికొనివచ్చిరి. ఆమహారాజావారికి శ్రీపిఠాపురమహారాజులాతిథ్యము నొసఁగిరి. పిఠాపురమహారాజులబంగాళాలో వసతియొనర్చిరి. పిఠాపుర సంస్థానము మేనేజరు పిల్లారిసెట్టి రంగబ్రహ్మారావునాయఁడుగారును, కాకినాడ తాణేదారు కో కాశీవనాథశాస్త్రిగారును, వారియనుచరులును శ్రీవారికతిథిసత్కారముల నొనర్చిరి.

శనివారము- ఉదయమున విస్తారము వర్షము కురియుటచేత సభ జరుప వీలు లేకపోయినది. మధ్యాహ్నము రెండుగంటలకుఁ బ్రారంభించి సాయంకాల మూఁడుగంటలతో ముగింపఁబడినది.

ఈక్రింద వివరింపఁబడినవారును మఱియు ననేకులును సభ నలంకరించిరి :—

మ.రా. శ్రీ
శ్రీమాన్ మేడేపల్లి వేంకటరమణాచార్యులుగారు, విజయనగరము.
చెన్నాప్రెగడ భానుమూర్తిపంతులుగారు బి. ఏ., భీమవరము.
చిలుకూరి వీరభద్రరావుపంతులుగారు, కొవ్వూరు.
సేట్లలూరి వేంకటరాఘవఅయ్యంగారు ఎం. ఏ., బెజవాడ.
అక్కి వేంకటరామయ్యగారు, పెద్దాపురము.
కేశవరపు కామరాజుగారు, పెద్దాపురము.
కవిరాజు వత్సవాయ వేంకటనీలాద్రిరాజుగారు, తుని.
దర్భా సర్వేశ్వరశాస్త్రిగారు, పిఠాపురము.
వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు, పిఠాపురము.
రుద్రరాజు నరసింహరాజుగారు, పోడూరు.
ఎఱ్ఱగుంట్ల సుబ్బారావుగారు బి. ఏ., రాజమహేంద్రవరము.
అనంతపంతుల రామలింగస్వామిగారు, పార్వతీపురము.
ఓరుమల్ల అచ్యుతరావుగారు ఎం. ఏ., పిఠాపురము.
కళ్ళాప్రపూర్ణ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు, రాజమహేంద్రవరము.
బండారు తమ్మయ్యగారు, రాజమహేంద్రవరము.
వఝ్ఝల సూర్యనారాయణగారు, రేపల్లె.
నాళం అప్పలనరసయ్యగారు, రాజమహేంద్రవరము.
నల్లా చినరెడ్డినాయుడుగారు, అమలాపురము.
నండూరి బంగారయ్యగారు బి. ఏ., బి. ఎల్., రాజమహేంద్రవరము.
భావరాజు కృష్ణారావుపంతులుగారు బి. ఏ., బి. ఎల్., ,,
వడ్డాది శ్రీరామచంద్రమూర్తిగారు బి. ఏ., రాజమహేంద్రము.
బాలదారి నారాయణదేవుగారు. ,,
ఆర్య సోమయాజుల కాశీపయనులుగారు, కిర్లమపూడి.
బళ్ల రామచంద్రరాజుగారు, బిక్కవోలు.
డాక్టరు రామానుజము వేంకటకృష్ణయ్యగారు, పిఠాపురము.
దాసరి లక్ష్మణస్వామిగారు, ,,

దోసగపర్తి స్వామిగుప్తసిద్ధాంతిగారు.
పుల్య ఉమామహేశ్వరశాస్త్రిగారు, పాలకొల్లు.
గోటేటి జగన్నాథరావుగారు, విశాఖపట్టణము.
వేదుల వేంకటరావుగారు, కాకరపఱ్ఱు.
ఓలేటి సీతారామస్వామిగారు, పిఠాపురము.
వేదుల వేంకటరావుగారు, పుల్లేటికుఱ్ఱు.
వేదుల సూర్యసత్యనారాయణగారు, రాజమహేంద్రవరము.

(వ్యాసములు చదివినవారు నుపన్యాసముల నిచ్చినవారు నిందుఁ జేరలేదు.)

మఱియు, కాకినాడపౌరులలోఁ బ్రముఖులును, కళాశాలోపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థినులు పెక్కురు వచ్చిరి. వేదపఠనము, ఈశ్వరప్రార్థనము నైనపిమ్మట ఆహ్వానసంఘాధ్యక్షులు శ్రీమరిసేటి శేషగిరిరావు పంతులుగారు స్వాగతముం దెలిపిన పిదప అధ్యక్షులను జయంతి రామయ్యపంతులు గారు సభవారికిఁ దెలియఁజెప్పి వారిసుగుణముల, నౌదార్యాతిశయముల, విద్యావైభవముం బ్రశంసించి యగ్రాసనము నారోహింప నుపపాదింపఁగా వేదికపై నిలిచి శ్రీమహారాజు లుచితవచనరచనలతోఁ గొంత యుపన్యసించి యధ్యక్షాభిభాషణముం జదివిరి.

బ్ర. కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రిగారు పారితోషికపద్యరత్నావళి యను శ్లోకములం జదివిరి. వింజమూరి వేంకటలక్ష్మీనరసింహారావుగారు, క్రొత్తపల్లి సూర్యరావుగారును, బరిషత్ప్రశంసయు, మహారాజప్రశంసలుం గావించుపద్యములం జదివి యభినందించిరి. ఇరువదియైదుసంవత్సరములలోని పరిషద్వృత్తాంతమును గార్యదర్శులలో నొకరగు కిళాంబి రాఘవాచార్యులుగారు రజతోత్సవసంపుటమునుండి చదివి యాసంపుటమొక్కటి శ్రీవారికి సమర్పించిరి.

పరిషద్రజతోత్సవసందర్భమున, కట్టమంచి రామలింగారెడ్డిగారు ఎం. ఏ., ప్రొఫెసర్ కే. నీలకంఠశాస్త్రిగారు, మదరాసు డైరెక్టరుగారు, శ్రీకిర్లమపూడిరాజాగారు, ధారాకోటరాజాగారు, బెంగుళూరు మిథిక్ సొసైటీ కార్యదర్శులు, భారతీతీర్థసభాధ్యక్షులు, బొంబాయి కామా

ఓరియంటల్ ఇన్‌స్టిట్యూటువారు, వద్దాది సుబ్బారాయఁడుగారు, మైసూరుమహారాజ సంస్కృతకళాశాలాధికారులు, శ్రీ పర్లాకిమిడిమహారాజుగారు, డాక్టరు డి. వి. సుబ్బారెడ్డిగారు, ప్రభల లక్ష్మీనరసింహముపంతులుగారు మున్నగువారుపంపిన సందేశములలోఁగొన్నింటిని గార్యదర్శులు చదివిరి. ఈక్రిందియుపన్యాసములు గావింపఁబడినవి.

1. సాగి వేంకటనరసింహముగారు ఎం. ఏ. రాజమహేంద్రవరము, ఆంధ్రవాఙ్మయము, కరుణరసము. 2. పెండ్యాల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగారు, పిఠాపురము-తిక్కన సోమయాజి. 3. ఈయుణ్ణి వేంకటవీరరాఘవాచార్యులు ఎం. ఏ. గారు కాకినాడ-సంస్కృతవాఙ్మయము, ఆంధ్రకవులు. 4 జనమంచి సీతారామస్వామిగారు, అనకాపల్లి-సరస్వతీ రామాయణము. 5. గాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు ఎం. ఏ., బెజవాడ- దేశభాషలప్రాముఖ్యము-భారతజాతీయైక్యత, విద్యాలయముల నాంధ్రము, నాంగ్లము, హిందీభాషల కీయవలసిన స్థానమునుంగూర్చి యుపన్యసించిరి. 6. కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రిగారు, కవిమాన్యవిభాగము- కవుల వైదికి నియోగిభేదములచే విడఁదీయరా దనియుఁ గవిత్వమున రసభావాది విషయములే ప్రధానము లనియు నుపన్యసించిరి. 7. పోతుకుచ్చి వేంకటసుబ్బయ్యగారు బి ఏ. శ్రీకృష్ణదేవరాయలం గూర్చి చెప్పిరి. 8. చర్ల నారాయణశాస్త్రిగారు, పిఠాపురము-ఆంధ్రవ్యాకరణములలోఁ గల వైరుధ్యమునకుఁ గారణమును దెల్పుచుఁ గొన్ని ముఖ్యవిషయములం గూర్చి ప్రసంగించిరి. 8. కొండేపూఁడి సుబ్బారావుగారు (బి. ఏ. విద్యార్థి, కాకినాడ) శ్రీనాథుఁడు, కాశీఖండము నను చిన్నవ్యాసముం జదివిరి.

అధ్యక్షులవారు ప్రతియుపన్యాసకుని యుపన్యాసముపైని తమ యభిప్రాయము నప్పుడప్పుడే వెల్లడించుచు వచ్చిరి.

8 వ తేది, ఆదివారము, ఉదయమున,- గుంటూరుపౌరులచేఁ బరిషత్తునకు సమర్పింపఁబడిన శ్రీ జయంతి రామయ్యపంతులుగారి చిత్రకటమును- గుంటూరువారిపక్షమున మ. తెలికిచెర్ల వేంకటరత్నము ఎం. ఏ. గారు, ఆపటమును రచింపించుటకుఁ దగిన కారణముం దెల్పినపిమ్మట

శ్రీ జయపురాధీశ్వరులు, పంతులుగారి చిత్రపటమును బహిర్గతము చేయు కార్యము తమపైఁ బెట్టినందులకు సంతోషముతోఁ దత్కర్తను కారయితలను ప్రశంసించుచు రామయ్యపంతులుగారిని స్తుతించి చిత్రపటమును బహిరంగపఱచిరి. రామయ్యపంతులుగారు శ్రీవారి ప్రశంసావాక్యములకుచితసమాధానము నిచ్చిరి. ఈపటమును గుంటూరుపురవాసులు రామయ్యపంతులుగారిపైఁ దమకుఁగల గౌరవాతిశయములు సూచించుటకై రచియింపించి, పంతులుగారు ౨౫ సంవత్సరములనుండి పరిషత్ప్రతిష్ఠాపకులు, కార్యనిర్వాహకులు నగుటచేఁ బరిషద్భవనమునందే యీపటము నుంచుట యుచితమని, వారీపటమును బరిషత్తునకుఁ బంపుటకుఁ బూర్వము, ఈనెల ది 4 తేదిని గుంటూరు ఆంధ్రక్రిస్టియన్ కళాశాలాభవనమునందు సభగావించి యాసభలో నీచిత్రపటమును ముందుగాఁ బ్రదర్శించిరి. ఆసభకు, కాలేజీప్రిన్సిపాలుగా రగ్రాసనాధిపతులుగాను, శ్రీ కొండా వెంకటప్పయ్యపంతులుగారు పటప్రదర్శకులుగాను నుండిరి.

ఆసమయమున రామయ్యపంతులుగారిని గుంటూరుపౌరులు రప్పించి గౌరవించిరి. అపుడు శ్రీ కాశీవ్యాసాచార్యులుగారు పౌరులపక్షమునఁ గొన్నిపద్యములం జదివిరి. స్థలాంతరమున వానిం జూపనగును.

తరువాత రామయ్యపంతులుగారిని ప్రశంసించుచు, క్రొత్తపల్లి సూర్యరావుగారు, కొమఱవోలు వేంకటసుబ్బారావుగారు, బి. ఏ., నిడుదవోలు వేంకటరావుగారు, బి. ఏ., నల్లా చినరెడ్డినాయఁడుగారు, వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారును పద్యములను జదివిరి. అనంతరము సభాకార్యక్రమము ప్రారంభింపఁబడినది.

1. బులుసు వేంకటేశ్వరులుగారు, ఎం. ఏ., (కాకినాడ) ప్రస్తుతాంధ్రసారస్వతము, మతము, 2. శతావధాని దోమా వేంకటస్వామిగుప్తగారు, (చెన్నపురము) వైశ్యకవులు, 3 పిసుపాటి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు (కాకినాడ) శబ్దార్థవ్యవహారము, 4. విద్వాన్ శ్రీమత్తిరుమల పెద్దింటి రాఘవాచార్యులుగారు, తిక్కన అర్జునపాత్రమును బోషించిన విధమునను వ్యాసములం జదివిరి.

మధ్యాహ్నము రెండుగంటలకు శ్రీమహారాజావారు పరిషత్కార్యాలయము దర్శింప విచ్చేసిరి. పరిషద్భవనమును, పుస్తకభాండాగారమును, పరిషత్ప్రకటితగ్రంథములను జిత్తగించిరి. తాళపత్రగ్రంథములలో శ్రీతాళపత్రములపై వ్రాయఁబడిన పుస్తకములం గొన్నింటిని దిలకించిరి.

మూఁడుగంటలకు శ్రీ పిఠాపురరాజకళాశాలావిద్యార్థులు శ్రీవారికి సమ్మానపత్రముల నర్పించిరి. అనంతరము పరిషత్సభ ప్రారంభమైనది. శ్రీ పిసుపాటి చిదంబరశాస్త్రిగారు (శతావధానులు) ఆంధ్రసాహిత్యపరిషత్కృత్యములను గూర్చియు, విద్వాన్ పిసుపాటి విశ్వేశ్వరశాస్త్రిగారు ప్రశంసయనియుఁ బద్యములనుజదివిరి. పిఠాపురరాజకళాశాలాపండితులు విద్వాన్ కోపల్లెశివకామేశ్వరరావుగారు ప్రేమభావమునుగూర్చియుపన్యసించిరి. వఝ్ఝలసూర్యనారాయణగారు భారతమునఁ దమకుఁగల సందేహములవిషయమై తాము రచించిన గ్రంథమునుండి కొన్నిపద్యములం జదివిరి. జటావల్లభుల పురుషోత్తముగారు ఎం. ఏ. (కొవ్వూరు) నేఁటివాఙ్మయమున ననువాదముల ప్రాముఖ్యమునుగూర్చియు, నిడుదవోలు వేంకటరావుగారు, బి ఏ. (కాకినాడ) ఆంధ్రరాజకవులలో నగ్రగణ్యులగు నన్నెచోడ శ్రీకృష్ణదేవరాయ రఘునాథరాయులను గూర్చి యుపన్యసించిరి. శ్రీ పిఠాపురకళాశాలావిద్యార్థిని శ్రీమతి తణికెళ్ల రాజేశ్వరమ్మగారు తిక్కన సోమయాజినిగూర్చి యొక చిన్నవ్యాసముం జదివిరి. శ్రీ జయంతి రామయ్యపంతులుగారు శ్రీ సూర్యరాయాంధ్రనిఘంటు నిర్మాణమునఁ దామొనర్చుచున్న ప్రయత్నమును బద్ధతిని గూర్చి సభవారికి విశదపఱచిరి. పోతుకుచ్చి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, పాణినీయము, కావ్యభాషనుగూర్చియు, పింజమూరి వరాహనరసింహాచార్యులుగారు జయదేవుఁడు, అష్టపదులు- అనువిషయముంగూర్చియు ముచ్చటించిరి.

ఆమహాసభలో ననంతర మీక్రిందితీర్మానములు చేయఁబడినవి.

౧. ఆంధ్రసాహిత్యపరిషత్పోషకులలో నొకరును, విద్యాభిమానులును వేంకటగిరిసంస్థానాధీశ్వరులును నగు శ్రీశ్రీశ్రీ రాజా వెలుగోటి గోవిందకృష్ణయాచేంద్రబహద్దరు మహారాజావారి నిర్యాణమునకు నీసభవారు తమ సంతాపమును దెలుపుచున్నారు.

౨. ఆంధ్రసాహిత్యపరిషత్తునకు యావజ్జీవసభ్యులు దివాన్ బహద్దరు సర్ మోచెర్ల రామచంద్రరావుపంతులవారి మరణమునకును, సారస్వతాభిమానులు, విమర్శాకర్శకులు శ్రీయుత నడకుదుటి వీరరాజు పంతులవారి మరణమునకు నీసభవారు చింతిల్లుచున్నారు.

౩. శృంగారగ్రంథప్రకటనవిషయమున దొరతనమువారి నిషేధ పుటుత్తరువును దొలఁగించుట కీసభవారు కోరుచున్నారు.

౪. ఈపరిషత్తునకు ముఖ్యప్రతిష్ఠాపకులై, అనేకవిధముల పరిషత్తును బోషించుచున్న శ్రీ పీఠికాపురాధీశ్వరులగు శ్రీశ్రీశ్రీ మహారాజా రావు వేంకటకుమారమహీపతి సూర్యారావు బహద్దరువారికి పరిషత్తువారింక మూలమునఁ దమకృతజ్ఞతను దెలుపుచున్నారు.

౫. వేంకటగిరి సంస్థానాధీశ్వరులు, శ్రీశ్రీశ్రీ మహారాజా వెలుగోటి శ్రీ రాజగోపాలకృష్ణయాచేంద్రబహద్దరువారును బొబ్బిలిసంస్థానాధీశ్వరులయిన శ్రీ మహారాజా రావు శ్వేతాచలపతి వేంకటరంగారావు బహద్దరువారును, పరిషత్ప్రతిష్ఠాపకులుగా నుండి పరిషత్తున కొనరించిన మహోపకారమును కృతజ్ఞతాపూర్వకముగ స్మరించుచున్నారు.

౬. ఉద్ధారకులై, పరిషత్తునకు ధనసహాయమొనరించిన ఉయ్యూరురాజావారగు శ్రీశ్రీశ్రీ రాజా వేంకటాద్రి అప్పారావుబహద్దరువారికి నభినందనము లర్పించుచున్నారు.

౭. పరిషత్పోషకులుగా నుండి సహాయమొనర్చిన భాషాభిమానుల కెల్లరకు నీపరిషత్తువారు కృతజ్ఞతాపూర్వకవందనము లర్పించుచున్నారు.

౮. పరిషత్కార్య మింతోధికముగ నిర్విఘ్నముగా జరుగుటకై తగు మూలధనము, విశాలమగుభవనమును మిక్కిలి యావశ్యకములు. వీని సంపాదనకై భాషాభిమానులగు నుదారహృదయులు తోడ్పడవలె నని యీసభవారు కోరుచున్నారు.

౯. ఆంధ్రసాహిత్యపరిషత్కార్యముల నాదినుండియుఁ గడు దక్షతతో నిర్వహించుచు, సూర్యరాయాంధ్ర నిఘంటువును రచించుచు, నాంధ్రభాషాసేవకే తమజీవితమును వినియోగించుచున్న శ్రీజయంతి

రామయ్యపంతులుగారి కాంధ్రవిశ్వకళాపరిషత్తువారు "ఆనరరీ డి. లిట్." పట్టము నొసంగి గౌరవింతురుగాక యని యీసభవారు కోరుచున్నారు.

సభాధ్యక్షులగు శ్రీ మహారాజులుగారు భాషకు నియమమావశ్యకమనియు, నేపదములను మనము స్వీకరించినను నట్టివానియం దేదేనియు నొకనియమ ముండి తీఱవలయు ననియు, నేటి వాఙ్మయమున వాడుచున్న పదజాలము వాఙ్మయాభివృద్ధి నొనర్ప ననియు నింక ననేకవిషయములతో నుపన్యాసముం గావించి సభనుముగించిరి.

కళాశాలాధ్యక్షు లగు శ్రీ పెద్దాడ రామస్వామి ఎం. ఏ. గారు- అధ్యక్షులకు నుపన్యాసకులకు సభవారికిం బరిషత్పక్షమున వందనము లర్పించిరి. ఆహ్వానసంఘ కార్యదర్శులలో నొకరగు శ్రీ ప్రతివాదిభయంకరము పార్థసారథిగారు, కళాశాలాధికారులు, బాలభటసంఘము, రజతోత్సవసందర్భమున నొసరించిన సహాయమును బ్రశంసించిరి. మంగళగీతములతో సభపూర్తియైనది.

ఇట్టి మహాసభలో, పరిషత్ప్రతిష్ఠాపకు లగు శ్రీ పీఠికాపురము మహారాజులుగారు లేనిలోప మొక్కటితప్ప మఱి యితరలోపము లేవియుం గనఁబడ లేదు. ఈవిషయము నందఱును బలుమాఱు నుగ్గడించిరి.

శ్రీ పీఠాపురము మహారాజులు తమ కొసంగిన యాతిథ్యమును, మహారాజులు రైలుస్టేషనుకడ (తమయుత్కళభాషలో) పీఠా- యనంగా మిఠాయియనియు, పుర- యనంగాఁ బూర్ణమనియు శ్లేషించుచుఁ జక్కగఁ గొనియాడిరి.

కార్యదర్శులు శ్రీవారితో ఛామర్లకోటవఱకుఁ జని యనిపి సెలవుగొని తిరిగివచ్చిరి.

స్వాగతము.

జయపురాధీశ్వరా ! మిత్రులార !

శ్రీ జయపురము మహారాజావారు కడు శ్రమను వహించియుండి యిచ్చటికి విచ్చేసినందులకు వారికి మీయందఱపక్షమున నభినందనము లర్పించుచున్నాను. వీ రనేకభాషలలో విద్వాంసులును, గొప్పపండితులును, విద్యాపక్షపాతులు నైయున్నారు. ఆంధ్రవిశ్వకళాపరిషత్తున కుపాధ్యక్షులుగా నుండి సాంవత్సరమునకు లక్షరూప్యముల నొసఁగుచు మనలను జాలఁ గృతజ్ఞులనుగాఁ జేసియున్నారు. ఇంకను బెక్కుసంస్థలకును, బీదలకును ధనసహాయము చేయుచున్నారు. ఆంధ్రభోజుఁడను బిరుదము వీరియెడ సార్థకతను గాంచియున్నది. సాహిత్యపరిషత్తును స్థాపించినది మొదలు దీనియందు వీరికి మిక్కిలి యభిమానము కలదు. కొన్నిసంవత్సరముల క్రితము వీరు కాకినాడ దయచేసియున్నారు. ఇప్పుడు మరల వచ్చినందులకు వారికి మనయభినందనముల నర్పింపవలసియున్నది.

ఆంధ్రసాహిత్యపరిషత్తునకు నిరువదియైదేండ్లు గడచినవి. రజతోత్సవము జరుగుచున్నది. ఈసందర్భమున శ్రీశ్రీ పీఠికాపురాధీశ్వరుల యౌదార్యాతిశయములచే నభివృద్ధిగాంచుచున్న పరిషత్తునకు వీ రగ్రాసనాధిపత్యము వహించుటయు, నీయుత్సవము శ్రీ పీఠికాపురప్రభువుల కళాశాలాభవనమున జరుగుటయు నానందదాయకము.

శ్రీశ్రీశ్రీ మహారాజావారికిని, రజతోత్సవమునకు విచ్చేసిన పండితబృందమునకును కాకినాడపౌరుల పక్షమున స్వాగత మొసఁగుచు సభాధ్యక్షులుగానుండి సభాకార్యక్రమమును జయప్రదముగ నడపించుటకై శ్రీ మహారాజావారిని బ్రార్థించుచున్నాను.

ఇట్లు విధేయుఁడు,
దురిసేటి శేషగిరిరావు,
ఆహ్వానసంఘాధ్యక్షుఁడు.

అధ్యక్షాభిభాషణము.

ఆర్యమహాశయులారా,

ఆంధ్రసాహిత్యపరిషత్తుయొక్క "సిల్వరుజూబిలీ"ని నెఱవేర్పసమావేశ మగు నీపండితపరిషదధ్యక్షతను నాకొసంగుటవలనఁ దత్కృతజ్ఞతాసూచకముగాఁ దమకు నమస్కరించువాఁడను.

"జూబిలీ" యనునది యాంగ్లశబ్దము. ఏదేని యొకసంస్థ యేఁబది వత్సరములు నిలుచునేని తత్స్మరణార్థము సేయఁబడు నుత్సవ మని దాని యర్థము. ఏఁబదివత్సరములు దీర్ఘకాల మగుటవలనఁ దదర్థకాలమునందుఁ జేయఁబడు నుత్సవమునకు "సిల్వరుజూబిలీ" యనియు నేఁబదివత్సరకాలమునందుఁ జేయఁబడు నుత్సవమునకు "గోల్డనుజూబిలీ" యనియు నఱువదివత్సరకాలమునందుఁ జేయఁబడు నుత్సవమునకు "డైమండుజూబిలీ" యనియు నాధునికులు నామకరణముసేసిరి. డెబ్బదివత్సరకాలమునందుఁ జేయఁబడు నుత్సవమునకు నామకరణము గావలసియున్నది. యుక్తములగు నాచారవ్యవహారములను జ్ఞానము నన్యదేశమునుండి గ్రహించుట సముచితమె.

ఆంధ్రసాహిత్యపరిషత్తు ప్రాచీనరచనలను నవీనరచనలను వెల్లడించుచు ముఖ్యముగా నాంధ్రసాహిత్యాభివృద్ధికొఱకు నిరువదియైదువత్సరములనుండి పాటుపడుచుండుటవలనఁ దత్స్మరణార్థ మీయుత్సవము సేయుట కడు సమంజసము.

ఆంధ్రసాహిత్యపరిషత్తుయొక్క వార్షికోత్సవములందు నధ్యక్ష మహాశయులు నుడువవలసిన విషయములను సమగ్రముగా వెల్లడించియుండుటవలన నేను దేనిని జెప్పఁబూనిన నది చర్వితచర్వణముగానె యుండును మఱియు నుపదేశసమయము గడచెను. ఇది కార్యాచరణసమయము. విషయ మందఱకును గోచరము. కార్యముమాత్రము సాగకున్నది. నిద్రించువానిని మేలుకొలుపనగును; కాని నిద్రించునట్లు నటించువానిని మేలుకొలుప శక్యము గాదుగదా. కనుక నుపన్యసించుట యనావశ్యక మని నమ్మిన నేనాచారము ననుసరించి కొన్నిమాటలను మాత్రమె నుడివెదను.

శ్రుతిస్మృతిశాస్త్రపురాణేతిహాససహిత మగు నది సాహిత్య మని పూర్వపండితులయాశయము. కనుకఁ గొన్నిపురాణములును బ్రబంధములును ఖండకావ్యములును నవలలును నాటకములును చిట్టకథలును గల వర్తమానాంధ్రసాహిత్యము పూర్ణాంగముగలదియని పలుకుపడదు. పండితులు శాస్త్రాదుల నాంధ్రమునందు రచించికాని, యనువదించి కాని దానిని బూరింపవలెను.

నాగరకతకుఁ బ్రధానలక్షణము నియమ మగుటవలన నాగరుల భాష నియమబద్ధమయి యుండవలెను. ఇప్పటి యాంధ్రవ్యాకరణము లసంపూర్ణములగుటవలన భాషాభిమానముగల పండితు లొకపరిషత్తుగా నేర్పడి యొకవ్యాకరణమును రచింపవలెను. దానిననుసరించియె కవులు గ్రంథములను రచించుచుండవలెను. అట్టిగ్రంథములనె జను లాదరించుచుండవలెను. "ఆపరితోషా ద్విదుషాం న సాధు మన్యే ప్రయోగవిజ్ఞానమ్," అను కాళిదాసమహాకవివాక్యమును గవులు నిజమనములందు నుంపనగును. మఱియును గవులు పామరామోదముకొఱకును గేవల ధనార్జనముకొఱకును బ్రతీక్షించి యనియమభాషతో నసత్కావ్యములను రచించుటయు నట్టివానిని బ్రకాశకులు ప్రకటించుటయును గర్హితకార్యములు. అట్టి రచనలవలన నాంధ్రభారతి పాండురోగిణియె యగును; కాని సుష్ఠాంగకములతో బలుపుగలది గాఁజాలదు.

ఇప్పటి వ్యవహారమునుబట్టి కొన్ని యన్యదేశ్యశబ్దచయమును యథారూపముగానే యాంధ్రమునందు వాడవలెను. దానియనువాదము సరియగుభావమును బోధింపదు. ఉదాహరణము:—జడ్జియను శబ్దమును న్యాయాధిపతి లేక న్యాయాధికారి యని వాడినచో, విలేజిమున్సిఫా, సబుమేజిస్ట్రేటా, డిప్యూటికలక్టరా, కలక్టరా, డిస్ట్రిక్టుమున్సిఫా, జడ్జియా యనుసందేహము దోఁచును. కనుక జడ్జియని వాడుటయె సమంజసము. అన్యదేశ్య శబ్దగ్రహణము పూర్వపండితసమ్మతము. అట్లని స్వభాషాప్రచారితశబ్దములకు మాఱుగా నన్యభాషాశబ్దముల నెప్పుడును వాడరాదు.

ఇప్పటి విమర్శనములు ప్రాయశః శాస్త్రజ్ఞానమును భాషాజ్ఞానమును లేనివారిచేతనె చేయఁబడుచున్నవి. అవి దోషారోపణముతోడ నసభ్యభాష గలిగి కవిదూషణముతోడను బూరితములు. పండితులు గుణదోషములను లెస్సగా వెల్లడించి భావికవులకు మార్గప్రదర్శకములుగా నుండునట్లు చక్కని విమర్శనములను బ్రకటింపవలెను. విమర్శనములు సాహిత్యమున కెంతయు నావశ్యకములు. ప్రత్యేకపత్త్రికాప్రకాశకుఁడును లేకరియును విమర్శకస్థానము నాక్రమించుట దుఃఖకరవిషయము.

వార్తాపత్త్రికలును నాటకములును సాధారణజనజ్ఞానాభివృద్ధికి సహకారులు. అట్లుండ మనవార్తాపత్త్రికలలోఁ గొన్ని పెటయుండుఁ బాఱవేయఁదగు కాగితములతోడ, నంటియు నంటని సొట్టయక్షరములతోడను గుత్సితపదములతోడను బయలువెడలుచున్నవి. వాని సంపాదకులు విద్యాధికులు గారు వానియందలి కొన్నిశబ్దము లర్థశూన్యములు; సమాసములు వికృతములు. ధనాకర్షణమె వానిలక్ష్యము. అవి వానకారునఁ బుట్టు పుట్టగొడుగులువోలెఁ బెచ్చుగాఁ బెరుఁగుచు సామాన్యజనుల భాషాజ్ఞానమును జెఱుచుచుండుటవలన వాని నాదరింపఁజనదు.

మనదేశమునందు నాటకములు దఱుఁగుచుఁ జలచ్చిత్రములు పెరుఁగుచున్నవి. వానియందు నేపథ్యము సముచితముగా నుండదు; సంవాదము యుక్తముగా నుండదు; మీఁదుమిక్కిలి కొన్ని యశ్లీలచేష్టలు గానవచ్చెడు. కనుక నవి సంస్కరింపఁబడవలెను.

మహాశయులారా! కొన్నిమాటలనె నుడివెద నని చెప్పి పెక్కుమాటలను నుడివితిని. అవి యప్రియసత్యము లని యెఱిఁగియును వానిని నాగర్భమునందె జీర్ణింపఁజేసికొనుట కిచ్చగింపక తమకు విన్నవించితిని. నాయీ కోర్కులలోఁ గొన్ని యైనను నెఱవేర్పఁబడునేని ధన్యతను గాంతును.

ఇట్లు,
విబుధవిధేయుఁడు,
శ్రీవిక్రమదేవవర్మ.

పారితోషికపద్యరత్నావళిః.

శ్లో. యం భూపాలం విమలయశసం సంశ్రితా రాజ్యలక్ష్మీః
యద్రాజ్యే చ ప్రకటిత మభూ త్పాలనం ప్రేమపూర్ణమ్
యస్యాస్థానే బుధకవిగణాః సాదరం పూజితాః స్యుః
పాయా న్నిత్యం జయపురవిభుం విక్రమాఖ్యం త మీశః. 1

శ్లో. భూపాలేషు య మాహు రేక మనసే ప్రాజ్ఞం ప్రభుం పండితం
సాహిత్యేపి య మామనన్తి విబుధాః సామ్రాట్పదాలఙ్కృతమ్
షడ్భాషాసు విశారదం య మనఘం శంసన్తి శ్లాఘ్యాశయం
భూయా దాశ్రితకల్పకో మృకుగిరః శ్రీవిక్రమేన్ద్ర శ్చిరమ్. 2

శ్లో. పూర్వాం కాష్ఠాం దినమణి రసౌ పశ్చిమాం చాపి నిత్యం
పూర్ణానంద శ్చరతి వసుమా న్నేక్షతే దేశభేదమ్
తద్వ చ్ఛ్రీమాం స్త్రినగవసుధా ముత్కలాం చాపి ధాత్రీం
తుల్యప్రేమ్ణా జయపురనృపః సాదరం ప్రేక్షతే హో. 3

శ్లో. సకలకలితహస్త్రీ జ్ఞానదా జహ్నుపుత్రీ
కువలయదళనీలా పావనా సూర్యకన్యా
మిళితరసగతీ తే వార్యగేయే ప్రయాగే
జయపురనృపచన్ద్రే సఙ్గతే చోత్కలాన్ధ్రే. 4

శ్లో. భృఙ్గాణాం నినదై ర్యథాతిసుభగం పద్మాకరం భాస్కరః
తారాణాం సమితిం యథా హిమకరః సన్తోషయ త్యాదరాత్
ఏవం శ్రీ జయపూర్నృపాలతిలకో మోదం విధత్తే ధునా
వః సాహిత్యసభాసదాం హి విదుషా మధ్యక్షభా గ్ధీనిధిః. 5

శ్లో. కిం తస్య జన్మనా యేన నాదరం పూజితే ఉభే
స్వభాషా స్వీయమాతా చ కీర్తిసంపన్ముదావహే. 6

శ్లో. పూజ్యా మాతా వినయమధురైః సేవనై రార్యపుత్రైః
వన్ద్యా వాణీ సకలశుభదా స్వీయదేశాభిరామా

మాతా జన్తో ర్ముదితహృదయా సర్వసౌఖ్యం విధత్తే
స్వీయా భాషా విమలయశసం పూరుషం సా హి కుర్యాత్. 7

శ్లో. మోదితా నన్నయార్యాబ్ధేః చన్ద్రికేవ సుధానిధేః
భావగామ్భీర్యసమ్పన్నా పాతు సా భారతీసుధా. 8

శ్లో. భో విద్వాంసో విమలచరితాః సర్వతన్త్రస్వతన్త్రాః
హే కవ్యాద్యా మధురకవితాసృష్టిదక్షాః ప్రసిద్ధాః
భో భూపాలా వితరణచణా యేపి భాషానురక్తాః
ఆతిథ్యం నః సదయహృదయా శ్చానుగృహ్ణన్తు సర్వే. 9

ఏవం విబుధవిధేయః
సుబ్బయ్యనామధేయః.

శ్రీశ్రీ పిఠాపురమహారాజప్రశంస.

గీ. జయము శ్రీరావువంశప్రశస్తమణికి
జయము శ్రీసూర్యరాయభూజానిమణికి
జయము తత్పుత్రయుగళికి జయము పీఠ
పురమహారాజ్యలక్ష్మికిఁ బురికిజయము.

శా. లేరే రాజులు సూర్యరాయనృపమౌళిం బోలువా రెందఱో
వారీ యిట్టి జగత్ప్రసిద్ధ పరిమళ్సృష్టిన్ యశం బందువా
రేరీ యీకరమిచ్చు దాన మితరం బింతైన గుర్తింపఁగాఁ
బో రాకుండఁగఁ దేవసేవ లొనఁగం బోషింప దక్షుల్ మహిన్.

ఉ. ఏను సమర్థు లీ కలిని నిచ్చితినన్నను బుచ్చుకొంటిన
న్వారలెకాని నిస్పృహత స్వార్థపరచ్యుతి నాంధ్రభాషకుం
జేకుగడించుకోశమును జెక్కునెమ ల్బహుపండితాళి స
త్కారపురస్సరంబుగఁ బ్రకాశ మొనర్పఁగ బద్ధకంకణుల్.

చ. అరయఁగ రావు రావుమహిపాగ్ర్యమహాప్రభు గుప్తదానముల్
దురితభయుండు పోషితబుధుం డొనరించెడు మేళ్లు మించి త
త్పరిణతకార్యరూపమును బట్టి గ్రహింతురు లోకు లాతనిం
జిరముగ దివ్వెమెత్తి నతి చేయక యుండఁగఁ జెల్ల దాంధ్రికిన్.

శా. అవిద్యాద్ధృతి యాబుధావనము నయ్యార్యానుకూలత్వ మా
సేవిప్రాతకృపార్ద్రదృష్టి కృపణశ్రేణీతృణీకార మా
శావైరాగ్య మనాథదీనజనరక్షాదీక్ష నిర్గర్వముల్
భూవిస్తారయశుండు సూర్యనృపుఁ డెప్డుం బొంది దీపించెడిన్.

ఉ. ఈరజతోత్సవప్రభయు నీమహనీయసభావినోదముల్
శ్రీరమణుండు రావునృపశేఖరుపెట్టినభిక్షగా దొకో
సారభుజాబలంబు పరిమద్భర మోపి వహింపఁ గొన్నవాఁ
డీరహి రావుసూర్యనృపు నెంచుట దుర్లభ మాంధ్రవాణికిన్.

క్రొత్తపల్లి సూర్యరావు.

శ్రీ శ్రీ జయపురమహారాజప్రశంస.

ఉ. శ్రీ, విభవంబు, ప్రాభవ, మశేషమనీష, యుదారగౌరవం,
బీవి, దయాంతరంగము, సమిద్ధబుధావనవిక్రమంబులున్
శ్రీవిభుఁ డాత్రివిక్రమవశీకృతలోకుఁడు విక్రమాంకయు
గ్దేవున కిచ్చి ప్రోచుత స్వకీయగుణాద్భుతి నెల్లకాలమున్. ౧

చ. క్షమ కరుణించి శాంతి, యుదకంబు గభీరత చేర్చి, వహ్ని తే
జము దయచేసి, మారుతము సత్త్వము గూరిచి, ఖ మ్మున్నత
త్వము నిడి, సర్వభూతహితవర్తను బ్రోచుత నిన్ను నెప్పుడున్
విమలదయాంతరంగయుత విక్రమదేవధరాపురందరా. ౨

చ. సతులపతివ్రతామహిమ, సజ్జనసౌహృదవృత్తి, సత్కవి
స్తుతబహుకార్యసారసుధ, కేవలసాధుకృతాశిషంబు, బం
ధుతతిప్రమోద, మాప్తజనతుష్టి నితాంతము మీకొసంగు ను
న్నతి జయపూర్మహాప్రభు! ఘనా! జయ! విక్రమదేవ సన్మతీ! ౩

చ. ఎనిమిదిదిక్కులుం గరులు నేడునగంబులు నేడుదీవు లం
బునిధులు నాదికూర్మ మహి పోత్రి మహి న్వహియించు నేర్పు నీ
ఘనతరబాహుసంస్థితముగా నొనరించునుగాత నిచ్చలున్
వినయకళాకలాప పృథివీవసురాధిప సజ్జనావనా. ౪

ఉ. ఆర్గురుచక్రవర్తులుఁ బదార్గురుభూవలయాధినాయకుల్
భార్గవగీష్పతిప్రముఖభాసురమంత్రులు నీతిశాస్త్రకృ
ద్వర్గము వేదవేదులు ముదంబున విక్రమదేవవర్మ స
న్మార్గమహీప్రజావనసమర్థుని నిన్నొనరింతు రాదృతిన్. ౫

ఉ. భోజునిజూడఁగాఁ గవిత పుట్టె నటం చని రాయ్య లోమహా
రాజ! యసాక్షికం బది కరం బిపు డద్భుతసాక్ష్యమాయెఁ ద
ద్భోజనిభుండ వైన నిను బుద్ధిఁదలంచినఁ బుట్టుచుండె నా
యోజ నిరక్షరాస్యునకు నుత్సుకతం గవితావినోదముల్. ౬

క్రొత్తపల్లి సూర్యరావు.

స్వాగతము.

వింజమూరి వేంకటలక్ష్మీనరసింహారావు గారు.

సీ. బహుకావ్యరససుధాపానానఁ దనిసిన
మహితసాహిత్య సమ్రాట్టులార!
సకలశాస్త్రనికరసాగరోత్తరణంబుఁ
గాంచిన విబుధప్రకాండులార!
సరసప్రబంధరచనల బాహ్యప్రపం
చము మఱచు కవీంద్రచంద్రులార!
కావ్యదధిమథనకార్యాల నిపుణులౌ
విమలవిమర్శనవేత్తలార!
ఆంధ్రభారతీపాదభక్తాగ్రగణ్యు
లార! సువిశాలమార్గవిస్తారితంబు
నఖిలసౌఖ్యాలయంబు, వాయసపురంబు;
అందఁ డియ్యెడమాసల్పు స్వాగతంబు! ౧

సీ. ఆంధ్రవిశ్వకళాలయకిరీటవజ్రమణిని
బోషించుచేలెడు భూధవుండు
ప్రథిత"రాధామాధవ" కృతినొనర్చి "యాం
ధ్రజయదే"వాఖ్యకుం దగెడుఱేఁడు

బహుకృతికర్తయై భర్తయై, "సాహిత్య
సమ్రా"ట్టనంగ నెసంగుసామి
సకలనూతనకళానికరపోషకుఁడై "క
ళాచార్య" బిరుదంబు నందునృపుఁడు
జయపురాధిపశ్రేష్ఠుండు సర్వసుగుణ
భూషణుండు, విక్రమదేవ భూమిభుండు
సభకు సభ్యత్కుఁడౌ టదృష్టంబుగాదె?
ఆమహారాజమూర్తికి స్వాగతంబు ! ౨

సీ. అనవరతప్రవాహాంచితస్వచ్ఛధా-
రావిశిష్టవిమలజీవనంబు
బహుసుమనస్తోత్రపాత్రతాశోభిత
స్వర్ణాంబుజాదికసంయుతంబు
ఆత్మపూతప్రవాహప్లావితానేక
విబుధకోటీముక్తి విస్తరంబు
అతిమనోహరహంసకాధికదీపకా
లంకారసంశోభితాంకపాళి
సరసగీర్వాణగంగ; తత్ సారమెల్ల
నాంధ్రభూమిని విరివిగా వ్యాప్తిఁజేయ
సూర్యరాయభగీరథక్షోణివిభుఁడు
చేసిన మహాప్రయత్నముల్ సిద్ధిఁగాంచె. 3

చ. అనఘగ మాధరాధిపతి యాదట నిల్పిన యాంధ్రసాహితీ
పాషదగంబు కావ్యసుమపంక్తుల నెన్నియొ వెల్వరించి యా
యిరువదియైదువత్సరము లెంతొ ప్రమోదముఁ గూర్చి మించె, సు
స్థిరయశ మాంధ్రవాణి కిలఁ జేకుఱఁ జేసి విశాలశాఖలన్. ౪

సీ. అత్యమూల్యపదరత్నాకరంబౌ సూర్య
రాయనిఘంటువుం బ్రచురపఱిచి

ధాత్ర్యంతరస్థాపితములౌ ప్రబంధాల
వెలుగులోనికిఁ దెచ్చి వెల్వరించి
కమలాకటాక్ష భాగ్యంబుఁ గాంచని కవి
పండితకోటి కుపాధి నిచ్చి
ఆత్మాశ్రితాళి విద్యార్థిపాళికి సదా
విద్యాప్రదానంబు వేడ్క సల్పి
చతురమైన యాంధ్రసాహిత్యపరిషద్ర
మణికి విక్రమక్షమాధవుండు
నింపుపూన్చిఁ జేయు వెండిపండువునందు
నాట్యమాడు వాణి! నలువరాణి!

రజతోత్సవసందర్భమున బంపఁబడిన సందేశములు కొన్ని యిట చేర్పఁబడినవి.

(1) శ్రీయుత కట్టమంచి రామలింగారెడ్డిగారు ఆంధ్రవిశ్వవిద్యాలయోపాధ్యక్షులు, వాల్తేరు.

'I take this opportunity to congratulate the Parishat on the splendid career which it has had so far and to thank those who have been instrumental in making it the success it has been. And I trust that its future will be more glorious than its past.

The Academy is doing most useful work. It was started at a time when an organisation of its type had become a necessity for the Andhra Language.

You have chosen the right man to be the President on this auspicious occasion. As Patron of Literature, Scholar, Poet and a man of noble simplicity of life and universal benevolence, the Maharajah Saheb of Jeypore holds a place unique in the annals of South India. Please convey to him my respectful compliments. I congratulate the Parishat for getting him to preside.'

[ఈ పరిషత్తు భాషాభివృద్ధి కట్టిసంఘము లత్యావశ్యకములగు సమయమున స్థాపింపఁబడి నాఁటినుండియు నాంధ్రభాషకు మిక్కిలి యుపయోగకరమగు సేవ యొనర్చుచున్నది. నే నీసందర్భమున దాని మహోత్కృష్టమగు జీవితమును, అందులకు గారణభూతు లగు నుదారపురు

షులను బ్రశంసించి, యది యితోధికముగఁ బ్రశంసాపాత్రమై వర్ధిలుగాత యని యాశించుచున్నాను.

ఈ యుత్సవసందర్భమున భాషాపోషకులును, విద్వాంసులును, కవులును, త్యాగశీలురును, నిగర్వులు, సరళస్వభావులు నగు జయపురాధీశ్వరు లధ్యక్షతను వహించుట కడు సమంజసము. నేటి దక్షిణహిందూస్థానచరిత్రమున వీరత్యున్నతస్థానము నాక్రమింతు రనుట నిస్సందేహము. వారికి నా వందనములు. అట్టి మహాపురుషు నధ్యక్షునిగాఁ బడసినందున పరిషత్తును ధన్యతను గాంచినది.]

(2) ప్రొఫెసరు కె. ఎ. నీలకంఠశాస్త్రిగారు, మదరాసు విశ్వవిద్యాలయచారిత్రోపన్యాసకులు.

'While expressing my regret at my inability to avail myself of the invitation and go over to Cocanada, for the occasion, I wish to congratulate you on the excellent work so steadily carried out by the Parishat all these years. Its Journal has rightly taken its place among the inp ortant Research Journals of our Counrty and I wish the Jubilee function great success and the Parishat itself a long and glorious career of service to learning and research.'

[తమ యాహ్వానము నంగీకరించి రాజాలనందులకుఁ జింతిల్లుచుఁ బరిషత్తు ఇన్ని సంవత్సరములనుండియుఁ జేయుచున్న కృషి నభినందించుచున్నాను. పరిషత్పత్రిక మనదేశమునఁ గల ముఖ్యపరిశోధనాపత్రికలలో నొకటియైయున్నది. రజతోత్సవము నిర్విఘ్నముగ జరుగుఁగాక. పరిషత్తింకను భాషాభివృద్ధి పరిశోధనల కృషినినల్పి ప్రఖ్యాతిని బొందుఁగాక.]

(3) కిల్లంపూడి, ధారాకోట, పర్లాకిమిడి, సంస్థానాధీశ్వరులు సభకు రాఁజాలకపోయితిమని - రజతోత్సవము జయప్రదముగ జరుగుటకై తమ యాశీస్సులను బంపిరి. మిథిక్ సొసైటీ, బెంగుళూరు, కన్నడ సాహిత్య పరిషత్తు, కామా ఓరియంటలు యిన్‌స్టిట్యూటు, మున్నగు సంస్థలు తమ యభినందనములను బంపినవి. మ. రా. శ్రీ ప్రభల లక్ష్మీనరసింహము పంతులుగారు, బుఱ్ఱా శేషగిరిరావుపంతులుగారు, డాక్టరు డి. వి. సుబ్బారెడ్డిగారు, వడ్డాదిసుబ్బరాయకవిగారు, మున్నగువారుపరిషదభివృద్ధినికోరుచు లేఖలను వ్రాసిరి.

శ్రీజయంతి రామయ్య పంతులుగారికి గుంటూరి పౌరులు సమర్పించిన

వినుతి పత్రము.

శ్లో. జయ త్వనవద్యాప్తకళాభిరామః జయ త్వవాప్తైహికసర్వకామః
జయ త్వశేషప్రతివాదిభీమః జయంతి రామ స్సుగుణాబ్ధిసోమః.

చ. సరసత, శాస్త్రవేశ్మత, రసజ్ఞత, విజ్ఞత, వాగ్విహారని
ర్భరత, పరేంగితజ్ఞత, సుధంయుత, పూజ్యత, ధర్మకర్మత
త్పరత, దురుద్ధరార్తత్వ, ప్రధానత మున్నగు నీ పరశ్శతా
ద్భుతగుణముల్ ప్రశంస్యము; లెసంగునె రామయసూరి! యేరికేఁ?

సీ. అకలంకసుగుణరత్నాపూర్ణమణిపేటి
నానార్థిబృందమందారవాటి
బహుకళావిభవప్రభావాప్తసితకీర్తి
ధర్మసిద్ధాంతావతారమూర్తి
ప్రకటప్రబంధనిర్మాతృవిద్వన్మౌళి
న్యాయతంత్రార్థవిజ్ఞానశాలి
ఆంధ్రసారస్వశోద్యత్సానసమున్నత
ప్రాచీనకావ్యసంపత్ప్రమాత
వైదికవ్యవహారశోభయుబలాభి
రాముఁ డాంధ్రోక్తిసారసర్వస్వవేత్త;
యగుచు నలరు జయంతివంశాబ్ధివిధుఁడు
ప్రాజ్ఞచాతకఘనుఁడు శ్రీరామబుధుఁడు.

మ. పరవాగ్వశ్యులు మాతృభారతిని నిర్బంధించి, తత్పావనా
తురసంస్కారగతు ల్గలంచి, దురవస్థం గూర్చుచున్నంత, ని
ర్భరతన్ వారిని యుష్మదుక్తిశితశస్త్రక్షుబ్ధులం జేసి, ది
క్కృతి ప్రోద్రోయవె శ్రీజయంతి జయరామార్యా! యవార్యక్రియా.

సీ. చతురాననత్వంబు నాటి కల్గులచాఁ
దలవాకిటనె నిల్పఁగలిగినావు

అతుల 'శిరస్తదా'రాదిపదవు లంది
మాహేశసంపత్తి మసలినావు
సత్యసంగరసముత్సాహంబు నెలకొల్పి
భీష్మప్రతిజ్ఞ చే వెలసినావు
నిస్తులతరకోశనిర్మాత వై రాజ
రాజసఖత్వ మేర్పఱిచినావు
మహిత! నీదివ్యరామనామంబు జగతి
సార్థకముగాఁగ సర్వరంజకుఁడ వగుచుఁ
గీర్తిచంద్రిక దిక్తటిఁ గీలుకొల్పి
యలరుచుంటి జయంతి రామార్యవర్య!

శా. ఆవేగంబున గర్జ సేయు కవిసింహద్వంద్వముం దేర్చి, స
ద్భావవ్యాకృతిఁ గట్టఁగట్టి తుభయార్థత్వంబు శాంతింపఁ; బ్ర
జ్ఞావాచస్పతి నీవు; నీ పలుకు వ్యాసప్రోక్త మాంధ్రావనిన్;
నీ విద్వత్త కియత్త యున్నదె? జయంతిఖ్యాతరామాగ్రణీ!

శ్రీ జయంతి రామయ్యార్య ప్రశంస.

చ. కులపతివైతి పీఠపురికుంభినినాథుని పాఠశాలశి
ష్యులకును ద్వద్గురుత్వమున నున్నతి కెక్కిరి పెక్కు రల్లవా
రలు ప్రకటింత్రు నీదయిన ప్రజ్ఞను బోధకశక్తి దానఁ జే
రొలసితి వొజ్జబంతివయి యొజ్జలబంతిని రామపండితా.

ఉ. నీపరిషత్ప్రతిష్ఠఁగని నిచ్చలు నేఁటి కిసుల్లరీతి నె
న్నో పరిషత్తు లర్థమును నుండని పృద్భవ మందుచుండుఁ బో
నీ పరిష త్తనంగ నొక మెచ్చగుపండితమండలం బటం
చోపి గ్రహించె లోక మని యొప్పికొనం దగు రామధీమణీ.

ఉ. నీకవనంబు నీధిషణ నీసుముఖత్వము నీప్రభుత్వముల్
నీకమనీయరూపము సనిందితలోకహితార్థచింత యే
నీకలవే మఱొక్కరికి నిన్నియు నుండిన నిస్పృహత్వ ము
న్నే కలికాలచర్యలకు నెక్కడిమాటది రామపండితా.

మ. ఒకటే చాలును నీవొనర్చినది గ్రామ్య ల్గొంద ఆంధ్రంబు వా
డుకలో నున్నయసంస్కృతంబె తగియుండున్ శాస్త్రమర్యాద లే
టికటంచు న్సభకెక్కి నాకుసలుపన్ డీకొంటి సత్పండిత
ప్రకరంబుం గొని వారిపైఁ; బ్రభులు నీకట్టెరిగా పండితా.

ఉ. మాటకుఁ దప్పులేక, మనమాటయె వేద మటంచు గ్రామ్యభా
షాటన మాచరించియును నయ్యది తప్పుగఁ దోఁచి వారలే
మాటమెలంకువ ల్గనుచు మార్చిరి దానిని వ్యావహారికా
ర్భాటముగాఁగ వీరలటు పాణిను లాంధ్రికి రామపండితా.

ఉ. నీవొనరించుమేలు నవని న్నవభాషకుఁ జేయనేర్చునే
యేవిభుఁ డేకవీశ్వరుఁడు నింతటిదాఁక నిన్నుఁ గాంచి కా
దే వెలి కేఁగుదెంచెదరు ధీరులుగాకయు మేము మేమటం
చీవటు లెవ్వరోయి యనపేక్ష నొనర్పఁగ రామపండితా.

ఉ. మును పెనుమూలలం దడఁగి మూర్ఛిలియున్న పురాతనాశ్మశా
సనలిపిభారతిం దెలిపి సత్సభల న్వెలయంగఁ జేసి యం
జనమిడి కోలుపోయిన ప్రశస్తకవిప్రభుదాత్తవాగ్ధనం
బును దెలిపించి తాగతి యపూర్వముగాదొకొ రామధీమణీ.

మ. అపరాధోచితదండకుండవయి న్యాయాలోచన నీవుఁడు యూ
రపువాఁ డీతఁడు హైందవుం డనవు చిత్రం బౌర ! యాదండితుం
డెపుడున్ మైత్రిఘటించు నీ కదిగదోయీ తెచ్చెఁ బ్రఖ్యాతి యీ
విపులోర్వీతలి దానికంటె బిరుదుల్ వేయెక్కుడా పండితా.

మ. ఇపు డన్నన్ రుచిగాదుగాని సకలోర్వీశాధిరాణ్మౌళివా
రకరప్రజ్వలరత్నభాస్వరపదప్రాంతుండ వన్నన్ బలే
రహమా, రాష్ట్రనృపాలురెల్లరు భవత్ప్రాజ్ఞాజ్ఞ మన్నింప రే
యుపమాతీతనృపప్రభుత్వరచితోద్యోగాంక రామప్రభూ.

శ్రీ త్రిపల్లి సూర్యరావు.

ఆంధ్రసాహిత్యపరిషత్తు.

(1) వెండిపండుగ.

నిడుదవోలు వేంకటరావుగారు బి. ఏ.

మ. సరసోదారవచఃప్రసూనములఁ బూజల్సేయ విద్వత్కవీ
శ్వరు లాసూర్యనృపాలవిక్రమమహీశశ్రేష్ఠు లానందని
ర్భరులై యంకవసేయు, రామబుధసంభావ్యంబు నా సాహితీ
పరిషత్పీఠిని నాంధ్రవాణి! కొలువై భాసిల్లు మెల్లప్పుడున్.

సీ. తీరుతీయంబులై తేటతెల్లంబులై
చెలువారు తెల్గుపల్కులమెఱుంగు
నాణిముత్తెంబులై యపరంజిముద్దలై
కనుపట్టుప్రాఁల చొక్కపుమెఱుంగు
నుడివోనినుడువులై గడివోసబిగువులై
పోఁడిమినించు కూర్పులబెడంగుఁ
జనువులకుదురులై చవులకిరవులై
పాటిల్లు తొంటికబ్బపుమెఱుంగుఁ
దెలుఁగువారికిఁ బరిషత్తు తెలుప నిలిచి
యిరువదైదేండ్లనుండియు నెన్నికయగు
నూడిగము సల్పె; పేర్కొనె నేఁడుగాదె
వెండిపండువు; వెండియుఁ బండువిట్లు
వెలయు నది పసిఁడిపండువై యలరుఁగాత!

ఉ. భూనుత మాంధ్రిఁ జేసికొనుపున్నెపుఁబ్రోవు నృపాలమాత్రుఁడే
దీనజనాళికోటులకు దేవుఁ డితఁడు మనుష్యమాత్రుఁడే
కానఁగ నంచు సత్కవినికాయము సంస్తుతిసేయు నెప్పుడున్
మానిత రావు వేంకటకుమారమహీపతి సూర్యరాయనిన్.

గీ. సాహితీపరిషన్మహోత్సవమునకును
సాహితీసమరాంగణసార్వభౌముఁ
డైనవిక్రమదేవుఁ డధ్యక్షుఁ డగుచు

గౌరవ మొసర్చి ధన్యతగాఁగ మహము
సహజ మదిగాదె నృపవంశసంభవులకు.

గీ. సాహితీపరిషత్తుకు జయము జయము
జయ మగునుగాక తత్ప్రతిష్ఠాపకులకు
గీతి సాహితీరీతిని ఖ్యాతిఁజెందు
నాంధ్రభారతికిని జయం బహరహంబు.

(2) శ్రీజయంతి రామయపంతుల వారి ప్రశంస.

గీ. సాహితీపరిషన్మహోత్సవమునందుఁ
బూజ్యుఁడు జయంతి రామయబుధవరేణ్యు
వర్ణచిత్రసమర్పణ భావ్యమె కద
యాంధ్రపరిషత్తుపైని యతఁడై నకతన.

సీ. స్థాపించితివి యాంధ్రసాహితీపరిషత్తు భాషావధూటికిఁ బ్రాపు గాఁగ
వెలయించితివి సూర్యవిభుదయచే నిపు లాంధ్రశబ్దైకబృహన్నిఘంటు
ప్రకటించి తెన్నేని ప్రాచీనలిపియుక్త శాసనావళిని నిస్సంశయముగ
నాంధ్రీకరించితి వమరక ము త్తర రామచరిత్రంబు రమ్యఫణితి
చంపురామాయణంబు సజ్జనులుమెచ్చ
దొరతనంబున నున్నతోద్యోగి వయ్యు
మాతృభాషాభిమాని వై మనెదు నీకు
నహరహంబును జయము రామయసుధీంద్ర !

గీ. సరసకవిత విచక్షణశక్తి గలుగు
నాంధ్రవిద్వాంసులకు మేటి వైనకతన
నీయభిప్రాయముద్ర వర్ణితము గాని
గ్రంథ మేదేని తెనుఁగునఁ గానఁబడను.

గీ. దేశభాషాచరిత్రంబు తేటపఱుచు
శాసనజ్ఞుల కీ వనుశాసకుఁడవు
ప్రథితపరిశోధకాచార్యపదవిగనుము
భవ్యగుణసాంద్ర! రామయపండితేంద్ర !

క. శ్రీమహిజాధవుఁడొసఁగుని, రామయసౌఖ్యంబు నాయురభ్యుదయంబుల్
ప్రేమంబుననొసఁగు నుమా, రామయవిబుధేంద్రు నెపుడు రాజితలీలన్.

అభినవభారతి.

— విద్వాన్ కాశీ వ్యాసాచార్యులుగారు —

ఉత్పలమాల.

శాసనకర్త లై నన్నృపసత్తము లెల్లరుఁ దొల్లి, యాత్మ సం
తోసముతోడ రాజ్యరమతో సరిగాఁగఁ బరిగ్రహించి భా
షాసతిఁ గూడఁ బెంచిరి; విచారణకర్తలు వార లుండ సం
త్రాసము వాసి భారతియు రమ్యతరాన్యభృతహావభావ చే
ష్టాసముదీర్ణయై, నిజవచస్సుధ లొల్కఁగ దివ్యపాదవి
న్యాసములం జరించెఁ జతురాననహర్మ్యతలంబులందె; నాఁ
డాసతిఁ గాంచుటే ఘనులకైనను దుర్ఘట మౌచుఁదోఁచెఁ; గా
నీ సిరి డిందెనో! యిపుడిఁకేమని తెల్పెదఁ, దొంటికీర్తి వి
న్యాసము మాఱెఁ, గాలగతి యంతయు మాఱె, స్వరాజవర్గ మా
వాసవుఁ జేరె, నన్యనరపాలురపాలన మీఱె, దేశభా
షాసతి నిద్రఁగూరె, ననుశాసకు లెవ్వరు లేరటన్న వి
శ్వాసముతోడ నెవ్వనికి వాఁడె కవీంద్రపదంబుఁ గాంచుపే
రాసదివంబుముట్ట 'బళిరా! యదెభారతి చిక్కఁ జిక్కె' నం
చాసతికేలు బల్మిఁగొని "యాఁగుమిపీ! యెట కేఁగు దింక? నీ
పేసరి కొక్కపండితులనే వరియించెద నన్నుఁ బట్టి యా
బాసలు మాను మింక, భయభక్తుల మాకయిఁ బట్టు మింక" నం
చాసురభావమూని వికటార్భటి లాగఁగఁ, బావ మక్కటా!
యాసతిమేనఁ దాల్చిన మహార్హవిభూషలు జాఱెఁ, బాదవి
న్యాసము మాఱెఁ, వాక్యములయందునఁ దొట్రిలుపాటు గూరెఁ, గ
ట్టా! సరసంపుఁబాకముల యందు రుచు ల్పసలేఱె, సంధులున్
వాసి చలించుచుండ సడలఁబాఱెఁ, బొరింబొరి సర్వభావస
న్న్యాసము మీఱె, నీవయి వినం గనరాని విఁకెన్ని క్రొత్తలా
వేసము లూని భారతి నవీనగతిం జరియించునోగదా!

మ్రమ్యల్ యాంతం బగుఁ-వ శ్శైనల్ దగుఁ "చంద్రరేఖఁ"-
మ U U U, ర U I U, మ U U U, య I U U, య I U U;

పరవిఁ నగణంబులు పం-చకమా "నలినిఁ"-న I I U, న I I U,
న I I U, న I I U, న I I U;

రా ష్టివళ్ల "మణిభూషణ"-మా రనభారలఁ-ర U I U, న I I I,
భ U I I, భ U I I, ర U I U;

అయతి నజాభర లున్న-నాను "మనోజ్ఞ"కుఁ-న I I I, జ I U I,
జ I U I, భ U I I, ర U I U;

కుంభివ త్రిజద్వయం బ-గుఁ రముఁ "ప్రశాంతికిఁ"-ర U I U,
జ I U I, ర U I U, జ I U I, ర U I U.

" ఆలసగతి"యా నసన-లంది భయలొందఁ-న I I I, స I I U,
న I I I, భ U I I, య I U U;

ఏడుహంబులుఁ గరుఁ వ-డె న్నిది "స్రగంధికిఁ" హ U I,
హ U I, హ U I, హ U I, హ U I, హ U I హ U I, గ U;

దీనిపేరె "చామరంబు"-ధీరవంద్య మారుతీ.

క. అల పదియూఱవ'యష్టిని'
గల రసశిఖశరశరర్తు[1] గణన సువృత్త
ములలోఁ బ్రియకాంతాదులు
కలితములై పది మెసఁగుఁ గవినుతచరితా. ౮౮.

౧౬.యతి "ప్రియకాంతఁ " దిశల న-యద్వంద్వసగంబుల్-. న I I I,
య I U U, న I I I, య I U U, స I I U, గ U;

లగాష్టకాత్త భూయుతుల్ చె-లంగుఁ "పంచచామరఁ"-
లగ I U, లగ I U, లగ I U, లగ I U, లగ I U, లగ I U,
లగ I U, లగ I U;

నభజజాగల దిశాయతి-నల్వయి "పద్మ"మా-న I I I, భ U I I,
జ I U I, జ I U I, జ I U I, గ U;

1. రసశిఖశరశరర్తులు-౬౫౫౩౬.

కవీంద్రా "చంద్రశ్రీ" యమనసర-గల్ వళ్లు రుద్రుల్-య I U U, మ U U U, న I I I, స I I U, ర U I U, గ U;

యతి పదితో నజభ్జరగ-లౌను "మేదిని" న్వాఁ-న I I I, జ I U I, భ U I I, జ I U I, ర U I U, గ U;

స్వామి "మదనదర్పం" బగుఁ భ-సల్ రజజల్ గముఁ-భ U I I, స I I U, ర U I U, జ I U I, జ I U I, గ U;

మహి "ఫలసదన" మగు-మనులఘుగగంబుల్-లఘువులు ౧౪, న I I I, న I I I, న I I I, న I I I, స I I U, గ U;

నజభజరల్ గముఁ త-నరి "వాణి" నింపొసంగుఁ-న I I I, జ I U I, భ U I I, జ I U I, ర U I U, గ U;

భ్రంబులు నానగల్ వ-రఁగు "గజవిలసిత" మై- భ U I I, ర U I U, న I I I, న I I I, న I I I, గ U;

ఐదుభకారములుఁ గము-నైతగు "పశ్వగతిఁ"-భ U I I, భ U I I, భ U I I, భ U I I, భ U I I, గ U.

క. తగు సప్తదశా 'త్యష్టిని'
యుగమునిఖేంద్వగ్నిహిమమయూఖుల[1] లో మె
చ్చుగ శిఖరిణి మొదలెన్నిక
మిగులఁ బ్రశస్తములు విను సమీరణతనయా. [illegible]

౧౭. యతిస్థానం బగ్రుల్ యమనసభవం-బౌ "శిఖరిణిఁ"-య I U U, మ U U U, న I I I, స I I U, భ U I I, వ I U;

నజభజజల్వముఁ యతిగ-నఁ దిశ "నర్కుటకముఁ"-న I I I, జ I U I, భ U I I, జ I U I, జ I U I, వ I U;

అగరసవిశ్రమా-ఖ్య "కుదకోకిల-కాంక"[2] మిదే-

జసల్ జసలు నుఁ యవల్ గిరిశ-సంజ్ఞ "పృథ్వీఁ" యతుల్-జ I U I, స I I U, జ I U I, స I I U, య I U U, వ I U;

---

1. యుగమునిఖేంద్వగ్నిహిమమయూఖులు ౧౩౧౦౭౭.

2. అప్పకవి కోకిలకాక మని చెప్పెను.

నసమరసవల్ వళ్లరుల్ గైకొనన్ "హరిణిం" దగున్ - న ।।।,
స ।।U, మ UUU, ర U।U, స ।।U, వ ।U;

"మందాక్రాంతన్" మభనతతగా-మార్గమా దిగ్యతుల్గాన్-మUUU,
భ U।।, న ।।।, త UU।, త UU।, గా UU;

"త్వరితపదగతి" దిశల-వడినననసనాగాల్-న ।।।, న ।।।, న ।।।,
న ।।।, న ।।।, గా UU;

ఇదియే "పలాశదళ" మనువృత్తము.

బాగగు "వంశపత్రపతితన్"-భరనభనలగల్-భ U।।, ర U।U,
న ।।।, భ U।।, న ।।।, లగ ।U;

సజసాస్వ లా యతి గ-జంబులఁ "జంపకకేసరిన్"- స ।।U,
జ ।U।, స ।।U, స ।।U, స ।।U, వ ।U.

క. 'ధృతి' యను ఛందంబునఁ గల
చతురంబుధిచంద్రనేత్రశాస్త్రాఖ్యులఁ[1] బొ
ల్చి తగుకుసుమితలతావె
ల్లితాదు లవి యాఱు దనరె లేఖారిహరా. ౯౦

౧౮. వి స్తన్నల్ యాయల్ "కుసుమితలతా-వేల్లిత" స్వల్లు రుద్రుల్-
మ UUU, త UU।, న ।।।, య ।UU, య ।UU,
య ।UU;

మారుతీ రసజాభరల్ తగు-"మత్తకోకిల" దిగ్యతిన్--ర U।U,
స ।।U, జ ।U।, జ ।U।, భ U।।, ర U।U;

అష్టబాణవిరామమై-యన సొ నిదే-"హరిణప్లుతన్"
ఔరసజ్యభగోక్తి వ-ళ్లహిబాణంబుల్-"హారనర్తన్"-ర U।U,
స ।।U, జ ।U।, య ।UU, భ U।।, ర U।U;

నయుగము రచతుర్గ-ణంబై "విశా"వృత్తమాయత్యహిన్-న ।।।,
న ।।।, ర U।U, ర U।U, ర U।U, ర U।U;

"స్నాహారంబు" మనయాతన్మప్రో-క్తం బగు యతిదిక్కుల్ గాన్-
మ UUU, న ।।।, య ।UU, త UU।, మ UUU.

---

1. చతురంబుధిచంద్రనేత్రశాస్త్రాఖ్యులు ౬౬౨౧౮౪.

2. స్నాహారవృత్తమునకు అప్పకవీయములో "రత్నేషు"యతులని రెండుతావులఁజూపెను.

క. ఛందోమ్మిదైన 'యతిధృతి'
యం దహివసుకరజలధియుగాస్త్రసమితిలోఁ[1]
జెంది తరళాదివృత్తం
బందం బగుఁ గృతుల వినుము హనుమన్నాథా. ౯౧

౧౯. భవయతిం "దరళం" బెసంగు న-భంబులుఁ రసజాగముల్-
న III, భ UII, ర UIU, స IIU, జ IUI, జ IUI, గ U;

కంజాతాప్తయతిఁ మసజ్జసతతల్-గంబుండు "శార్దూల" మా-
మ UUU, స IIU, జ IUI, స IIU, త UUI, త UUI, గ U;

భారసజాగల రుద్రవిశ్రమ-భాతి "భూతిలకం" బగుఁ-భ UII,
భ UII, ర UIU, స IIU, జ IUI, జ IUI, గ U;

"కవికంఠభూషణము"-గఁ సజసాసజగల్ వ జెన్నిధిఁ-స IIU,
జ IUI, స IIU, స IIU, స IIU, జ IUI, గ U;

సద్రసాతజజంబుగముంగాఁ"-జంద్రకళం" దగుఁ దిగ్యతిఁ-ర UIU,
స IIU, స IIU, త UUI, జ IUI, జ IUI, గ U;

మిళద్వ్యత్యర్కుల్ యమ్న సరరగలా- "మేఘవిస్ఫూర్జితా"ఖ్యఁ-
య IUU, మ UUU, న III, స IIU, ర UIU, ర UIU, గ U.

క. ఇరువదియగు 'కృతి'లోఁ రస
ధరశరవసువార్ధిఖేందు[2]తతిలోఁగల యం
బురుహాది సప్తవృత్తము
లిరవగుఁ గావ్యముల దాసహితమందారా. ౯౨

౨౦. "అంబురుహంబు" భభాభ్రసవల్ యతు-లంబుజాప్తుల రాఁ నగుఁ-
భ UII, భ UII, భ UII, భ UII, ర UIU, స IIU,
వ IU;

వడి రుద్మాట సభల్ రసల్ మయవల్ - వైపొందు "మత్తేభ"
కుఁ- స IIU, భ UII, ర UIU, న III, మ UUU, య IUU,
వ IU;

---

1. అహివసుకరజలధియుగాస్త్ర-౫౪౪౨౮౮.
2. రసధరశరవసువార్ధిఖేందులు-౧౦౪౮౫౧౬. మూలములో "కృతిలోపల, ధరశర" ఇత్యాదిగానున్నది.

పంకజభూయతుల్ భరన - భారవ "ఉత్పలమాలికం" దగున్-
భ U||, ర U|U, న |||, భ U||, భ U||, ర U|U, వ |U;

అగు నభామసనల్ వముతో ఫా-లాక్షయతిన్ "ఖచరప్లుతన్"-
న |||, భ U||, భ U||, మ UUU, స ||U, స ||U, వ |U;

కయతి నజాభరస ల్వముం గలు-గం "ప్రభాకలితం" బగున్ - న |||,
జ |U|, జ |U|, భ U||, ర U|U, స ||U, వ |U;

పద్నాల్గింటన్ యతుల్గా మరభనయభవల్-ప్రాపౌ "సువదనన్"-
మ UUU, ర U|U, భ U||, న |||, య |UU, భ U||, వ |U;

త్రైరజల్ హాముం జో-రంగఁ దర్శమడ్వ-రామమైనవృత్తమొప్పు-[1]
ర U|U, జ |U|, ర U|U, జ |U|, ర U|U, జ |U|, హ U|.

క. ఇరువది యొకటగు 'ప్రకృతిని'
కరశరశశిమానిరంధ్రగగనాక్షుల[2] స్ర
గ్ధర మొదలగు వృత్తంబులు
పరఁగఁగ నొకయాఱు వెలయుఁ బవనతనూజా. ౯౩

౨౧. క్ష్మాభృద్భూభృద్యతుల్గా - మరభనయయయల్ - మానగున్ "స్రగ్ధరాఖ్యన్"- మ UUU, ర U|U, భ U||, న |||, య |UU, య |UU, య |UU;

నజభజజారదిగ్విరమ-ణంబులఁ "జాపకమాలికం" దగున్ - న |||,
జ |U|, భ U||, జ |U|, జ |U|, జ |U|, ర U|U;

ససమాతయల్ రవివిశ్రమము-స్సాధికన్, "లాటీవిట" మ
య్యెన్ - స ||U, స ||U, స ||U, స ||U, మ UUU, త UU|,
య |UU;

యతి పదమూఁట నజాజజభల్ రము - నొఁ గృతిన్ "వన
మంజరిన్". న |||, జ |U|, జ |U|, జ |U|, జ |U|, భ U||,
ర U|U;

1. ఈవృత్తము పేరు చెప్పలేదు.

2. కరశరశశిమానిరంధ్రగగనాక్షులు-౨౦౯౭౧౫౨.

హనుమా సజత్రయము సంబు-నౌను "మణిమాలికన్" దళయతిన్- స ।।U, జ ।U।, స ।।U, జ ।U।, స ।।U, జ ।U।, స ।।U;

లఘు లిరువది గురువుఁ "కనక-లత" కెనయు వినయతిన్-(న ।।।, న ।।।, న ।।।, న ।।।, న ।।।, స ।।U) ల ।।।।।।।।। ।।।।।।।।।।। గు U.

క. ఇరువదిరెం డగు 'నాకృతి'
శరధిఖశిఖివార్ధిధాత్రిశశిజలధుల[1]లోఁ
దురగాదికవృత్తము లై
దిరవొందును గృతులయందు సిద్ధచరిత్రా. ౯౪

౨౨. నననన సజజగములఁ "దురగ"మున్- మనూక్తయతిం దగున్- న ।।।, న ।।।, న ।।।, న ।।।, స ।।U, జ ।U।, జ ।U।, గU;

కెమానుల్వశ్మహాస్ర-గ్ధర సతతనసల్- గల్గిరాగంబు లుండన్- స ।।U, త UU।, త UU।, న ।।।, స ।।U, ర U।U, ర U।U, గ U;

భాస్వితమై రనత్రయము గంబు-నై భవునివళ్ల "భద్రక"మగున్- భ U।।, ర U।U, న ।।।, ర U।U, న ।।।, ర U।U, న ।।।, గ U;

భంబు రనల్ రనల్ ననగురుల్- కుదింటను వల్లిడ "మద్రక" మగున్- భ U।।, ర U।U, న ।।।, ర U।U, స ।।U, స ।।U, న ।।।, గ U

వేడ్భగురుల్ రవినేని రసత్రము-నేన్వడి "మానిని"- కిట్లిడనా-[2] భ U।।, భ U।।, భ U।।, భ U।।, భ U।।, భ U।।, భ U।।, గ U.

క. 'వికృతి'కి నిరువదిమూఁడును
సుకృతికి వసుఖర్తుగజవసుశిఖిధములం[3]
దోకనాల్గు వర్ధనాభా
దికవృత్తము లమరు వాయుదేవకుమారా. ౯౫

1 శరధిఖశిఖివార్ధిధాత్రిశశిజలధులు-౪౧౯౪౩౦౪.

2. మానినికి అప్పకవీయములో-విశ్వవిరామ మెుక్కటియే చెప్పెను.

3. వసుఖర్తుగజవసుశిఖీధ్రములు-౮౩౭౮౭౬౦౮.

౨౩. భాస్వద్యతి న్నతతంబుల్ గగంబున్న-భాస్వద్యశా "వర్ధనాథంబు" మించున్-త ౼ ౼ ।, త ౼ ౼ ।, త ౼ ౼ ।, త ౼ ౼ ।, త ౼ ౼ ।, త ౼ ౼ ।, త ౼ ౼ ।, గగ ౼౼;

నము త్రిజభల్ వముం దనరునా ది-నప్రభువిరామ "మశ్వలలిత"-న ।।।, జ । ౼ ।, భ ౼ ।।, జ । ౼ ।, భ ౼ ।।, జ । ౼ ।, భ ౼ ।।, వ । ౼;

"మత్తాక్రీడ" మాతల్ నానాల్-మతి వము వసుగజ-మత యతు లమరున్-మ ౼ ౼ ౼, మ ౼ ౼ ౼, త ౼ ౼ ।, న ।।।, న ।।।, న ।।।, న ।।।, వ । ౼;

ప్రతిసరస మద్యతి-రా నము మజ్జలు-రాఁ "గవిరాజవిరాజితమా" న ।।।, జ । ౼ ।, జ । ౼ ।, జ । ౼ ।, జ । ౼ ।, జ । ౼ ।, జ । ౼ ।; వ । ౼.

౪. ఇరువదినాల్గగు 'సంకృతి'

హారజముఖేంద్వక్షిమానిహాయమునిరసభే
శ్వరు[1] లందుఁ గ్రౌంచపదముఖ
వరవృత్తచతుష్క మొప్పు వటులోకమణీ. ౯౬

౨౪. కంచయుగాపాంల్ "క్రౌంచపదీ"వ-ళ్ళమసభన ననయ-పరిమిత మయ్యెన్-భ ౼ ।।, మ ౼ ౼ ౼, స ।। ౼, భ ౼ ।।, న ।।।, న ।।।, న ।।।, య । ౼ ౼;

సంధిల్లున్ మనతేసర్భ-జ్యలయు వ "భుజంగమూర్తి"-సరవితోఁ గరి దంతుల్-మ ౼ ౼ ౼, న ।।।, త ౼ ౼ ।, స ।। ౼, ర ౼ । ౼, భ ౼ ।।, జ । ౼ ।, య । ౼ ౼;

సారాజాహిస్ఫారయతుల్ మిం-చ మతయనననన-సల "సరసిజ" మా-మ ౼ ౼ ౼, త ౼ ౼ ।, య । ౼ ౼, న ।।।, న ।।।, న ।।।, న ।।।, స ।। ౼;

"తన్వీకిఁ" బద్ధాప్తయతి ననిలపు-ప్రాభతనల్ సభభనయలు చెంద్-భ ౼ ।।, త ౼ ౼ ।, న ।।।, స ।। ౼, భ ౼ ।।, భ ౼ ।।, న ।।।, య । ౼ ౼.

---

1. హారజముఖేంద్వక్షిమానిహాయమునిరసభేశ్వరులు-౧౬౭౭౭౨౧౬.

క. ఇరువదియై దగు 'నభికృతిఁ'
గరగుణగతిగతిశరవిశిఖగుణాగ్నులు[1] భా
స్కరవిలసితంబు మొదలై
వరఁగెను వృత్తత్రయంబు భానుజమంత్రీ. ౯౭

౨౫. "భాస్కరవిలసిత" మర్కయతిం గూర్పఁ భనజయభననసగల
మించుఁ-భ U | |, న | | |, జ | U |, య | U U, భ U | |,
న | | |, న | | |, స | | U, గ U;

ననన న సభభభ గురువులయతి యెన్నం బదియేనిట "బంధుర"
మౌ-న | | |, న | | |, న | | |, న | | |, స | | U, భ U | |, భ U | |,
భ U | |, గ U;

వడి గిరి మునుల-వసునగణగలు-వలె నిడ "ధరణిధరగతిఁ"-
న | | |, న | | |, న | | |, న | | |, న | | |, న | | |, న | | |, న | | |, గ U.

క. ఇరువదియాఱగు 'నుత్కృతి'
శరధిమదష్టాష్టఖేందుశైలర్తులలో[2]
బరఁగె భుజంగవిజృంభిత
దొరకొని వృత్తత్రయంబు ధూమ్రాక్షహరా. ౯౮

౨౬. తొల్తున్వసుల్ష్టాశార్తిఁ మౌ-తవనన రసవము లిడఁ-దా "భుజంగ
విజృంభితఁ"-మ U U U, మ U U U, త U U |, న | | |,
న | | |, న | | |, ర U | U, స | | U, వ | U;

ఓ బ్రహ్మర్తురసములను-యతిమగణగు-మాకనసగగ-"లపవాహ
ఖ్యఁ"[3]-మ U U U, న | | |, న | | |, న | | |, న | | |, న | | |,
న | | |, స | | U, గగ U U;

అభజసనద్వయగ-గాన్వితమునై యతిగ-జాహులగు మంగళమహా
శ్రీ-భ U | |, జ | U |, స | | U, న | | |, భ U | |, జ | U |, స | | U,
న | | |, గగ U U.

---

1. కరగుణగతిగతిశరవిశిఖగుణాగ్నులు-౩౩౫౫౪౪౩౨
2. శరధిమదష్టాష్టఖేందుశైలర్తు-౬౭౧౦౮౮౮౪.
3. అప్పకవి యీవృత్తమును వరాహవృత్తమనియెను.

గాలివెంబడి నొకకడఁ జేరు హరిమంచ
నిర్ముక్తకంచుకనిచయ మనఁగ
నబ్జగేహకు వాస మైనట్లు హరికి ని
వాస మైన సితాబ్జవన మనంగ
నక్షయచంద్రు నిమ్మని వారినిధి వేఁడ
వచ్చిన కైరవవార మనఁగ
నంబరంబున కెగసిన యపుడె మ్రింగు
నకట రాహుగ్రహం బన నార్తిఁ గలఁగి
జనకుఁ డగుసింధురాజు సక్షునని యున్న
విధుని బింబం బనఁగ మించు వెల్లదీవి. ౧౪

క. నెలనెలకు జలనిధానము
కలువలచెలిమండలంబు గావించుటకై
నిలిపిన మాదిరియో యన
వెలయుం దెలిదీవి కాంతి విశదం బగుచున్. ౧౫

గీ. తపనకరౌఘంబు వేఁడిమిఁ దాళలేక
శరధిఁ దేలుచు దుగ్ధపాండురిత మైన
దివసకరమండల మె తెల్లదీవి, యట్లు
గానినాఁ డుష్ణ హరి యుండఁగాఁ బనేమి. ౧౬

క. తనగు పయఃప్రకృతిని మృదు
వని యూడ సహింపలేక యంబుధి యొకచోఁ
గనుపించెనో కాఠిన్యం
బనఁగ సితద్వీప మఘదురాపం బమరున్. ౧౭

క. వనజదళాక్షుఁ డుదధి వా, మనసమూర్తి వసింప నచటి మట్టున నే పే
రెనో పాలసంద్ర మనఁగాఁ, గనఁబడుఁ దెలిదీవి రుచిధగద్ధగితం బై.

గీ. నీరుపాకలు గుబ్బగూడి నింగి కెగయ
వీచికారజ్జువులఁ గట్టి విడిచినట్టి
కాగితపు గాలిపటము నిష్కంపలీల
నున్నదో యనఁ దెలిదీవి చెన్ను మీఱు. ౧౯

గీ. వసుధలకు నెల్లఁ దారాజు గనుక పాల
కడలి పట్టించుకొను తెల్లగోడు గనంగ
నెసఁగు తెలిదీవి తనమీఁద నిద్రసేల
కల మునఁగ శౌరి తనుశోభ గ్రమ్ముకొనఁగ. ౧౦

గీ. ఏల సేతుండ గొల్లలయింపు పొచ్చి
వెన్న దోఁగిల సీవిద్య విభువు మనుదు
వారినిధి యల్లునికి నొక వంక నైచెఁ
దిన్నెగా వెన్న లనఁ దెల్లదీవి మెఱయు. ౧౧

గీ. మహికి మగతాలమొలనూలు రహివహించు
పాలకడలిని హరినీలశాలిమధ్య
మైన తెలిముత్తియపుమొగ వనఁగఁ బరఁగు
దీర్ఘధవళప్రభల కీవిఁ దెల్లదీవి. ౧౨

గీ. నాకవిభునకు వెఱచి మైనాకపూర్వ
పర్వతంబులలో నుండి పైని వేగు
నిలుపుగాఁ జొప్పమార్చు డిండీరపిహిత
దేహ మగుకొండ యనఁ దెల్లదీవి మెఱయు. ౧౩

గీ. కందుఁ గుంకును జెందు నాయింకునందు
నంచుఁ జింతించి తప మాచరించి కడలి
గన్న కందును గుంకును గనని యింకు
చందమునఁ దెల్లదీవి చెన్నొందు నెపుడు. ౧౪

క. అనుదినము వచ్చు బహువా
హినులఁ గలయు కడలిపాల నేర్పఱుపఁగ వ
చ్చిన పంచనాసితచ్ఛద
మనఁ దగు నాద్వీప మతిసితాభం బగుచున్. ౧౫

క. తెలిదీవి కలువరారా
చలువ మురారాతి వామచక్షురుచిశ్రీ
చెలఁదోఁగఁ దొరుఁగు పాండుర
సలిలంబులె నిండి దుగ్ధసాగర మయ్యెన్. * ౧౬

* దీనితరువాత "క. అ" అనిమాత్రమే యున్నది.

రఘునాథ రామాయణము.

పీఠిక.

ఈరామాయణము విజయవిలాసకృతిభర్త యగు రఘునాథనృపాలుఁడు రచించినది. ఇది పూర్తిగా లభించునను నాశతో - బ్ర. శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు సంపాదించిన యసంపూర్ణపుస్తకమునుండి యెత్తివ్రాసి ప్రకటింప నారంభించితిమి. కాని లభింపలేదు. లభించు నను నాశ యింకను విడువలేదు. యత్నము జరుగుచున్నది. దొరకినంతనే మరలఁ బ్రారంభించెదము. అంతవఱకు దీనిని మూలఁ బడవేయనేల యని యొక్క భాగముగా నీ 98 పుటలను బ్రకటించుచున్నారము.

ఎవ్వరియొద్దనైన మాతృకయున్నచోఁ బంపి మాయత్నము సఫలము చేయ నాంధ్రభాషాభిమానుల వేఁడుచున్నారము.

గ్రంథవిషయము మున్నగునవి సంపూర్ణగ్రంథములో వివరింపఁబడును.

క్రొత్తపల్లి సూర్యరావు.
